RNI NO: APBIL/2015/67544

# సువార్త

SUVAARTHA

సమగ్ర రాజకీయ, సామాజిక, ఆధ్యాత్మిక వార్తపత్రిక

సంపుటి : 11 సంచిక :29, సంపాదకులు: Ch.I ప్రశాంత్ కుమార్ మే 11 నుంచి 17 వరకు 2026 పేజీలు:8, వెల:రూ.5/.

## జులై, ఆగస్టు నెలల్లో పెరగనున్న టమాటా, ఉల్లి ధరలు

(సువార్త ప్రతినిధి): సామాన్యులకు బ్యాడ్ న్యూస్. వచ్చే జులై, ఆగస్టు నెలల్లో టమాటా ధరలు భారీగా పెరిగే అవకాశం ఉందని క్రిసిల్ నివేదిక అంచనా వేసింది. సాగు తగ్గడమే దీనికి కారణంగా పేర్కొంది. ఉల్లి, బంగాళాదుంప రేట్లు కూడా పెరిగే అవకాశం ఉందని తెలిపింది. గత ఏడాదితో పోలిస్తే టమాటా ధరలు 38%, వెజిటేబుల్ ఆయిల్, గ్యాస్ సిలిండర్ల ధరలు 7% పెరిగినట్లు వెల్లడించింది. ఉల్లి 16%, బంగాళాదుంప 14%, పప్పు ధాన్యాల ధరలు 4% తగ్గినట్లు రిపోర్ట్ ఇచ్చింది.

## త్వరలో స్థానిక ఎన్నికలు నిర్వహిద్దాం: సీఎం చంద్రబాబు

(సువార్త ప్రతినిధి): స్థానిక ఎన్నికలపై సీఎం చంద్రబాబు కీలక ప్రకటన చేశారు. త్వరలో స్థానిక ఎన్నికలు నిర్వహిస్తామని వెల్లడించారు. స్వర్ణాంధ్ర విజన్ 10 సూత్రాలపై కలెక్టర్ల సదస్సులో ఆయన సమీక్ష నిర్వహించి, వివిధ అంశాలపై జిల్లా కలెక్టర్లకు దిశానిర్దేశం చేశారు. లాజిస్టిక్స్ ఖర్చులు తగ్గించగలిగితే మరింత అభివృద్ధి సాధించవచ్చని సీఎం అభిప్రాయపడ్డారు. రైలు మార్గంలో కిలోమీటరుకు రూ.1.83 వ్యయం అవుతుండగా, రహదారి మార్గంలో రూ.3.40 ఖర్చు అవుతోందని ఆయన తెలిపారు.

# ఉన్నత విద్య కోసం విదేశాలకు వెళ్లే విద్యార్థులకు పావలా వడ్డీకే రుణాలు: సీఎం చంద్రబాబు




అమరావతి,(సువార్త ప్రతినిధి): దేశ విదేశాల్లో ఉన్నత విద్యాభ్యాసానికి వెళ్లే విద్యార్థులకు పావలా వడ్డీకే విద్య రుణాలు అందించాలని జిల్లా కలెక్టర్లను సీఎం నారా చంద్రబాబు నాయుడు ఆదేశించారు. శుక్రవారం రాజధాని అమరావతిలో జిల్లా కలెక్టర్ల సమావేశంలో ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలపై సీఎం చంద్రబాబు కీలక సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా సూపర్ సిక్స్ పథకాలతోపాటు తల్లికి వందనం, సంక్షేమంపై అధికారులకు సీఎం చంద్రబాబు సూచనలు చేశారు. అలాగే పథకాల అమలు, లబ్దిదారుల ఇంటిగ్రేషన్‌పై వారికి సీఎం దిశానిర్దేశం చేశారు.అన్నదాత సుఖీభవ, దీపం 2.0, స్త్రీ శక్తి, దివ్యాంగశక్తి పథకాలపై చర్చించారు. దీపం-2.0 పథకం కింద 1.08 కోట్ల మంది లబ్దిదారులు ఉన్నారని తెలిపారు. దీపం-2.0 పథకానికి ఇప్పటి వరకు రూ.3,504 కోట్లు ఖర్చు చేసినట్లు వివరించారు. స్త్రీ శక్తి కోసం ఏడాదికి రూ.1,940 కోట్ల ఖర్చు అవుతుందని చెప్పారు. తల్లికి వందనం కింద 67 లక్షల మందికి రూ.10 వేల కోట్లు ఖర్చు చేస్తున్నట్లు వివరించారు. ఏజెన్సీల్లో కాఫీ, పసుపు, కుంకుమపువ్వు సాగుకు ప్రోత్సాహం ఇస్తున్నట్లు ప్రకటించారు. అరకు కాఫీకి గ్లోబల్ బ్రాండ్ తెచ్చేందుకు కృషి చేస్తున్నట్లు సీఎం చంద్రబాబు తెలిపారు. జిల్లా కలెక్టర్‌ల సమావేశం గురువారం రాజధాని అమరావతిలో ప్రారంభమైంది. రెండు రోజుల పాటు జరిగే ఈ సమావేశం ఈ రోజు సాయంత్రం ముగియనుంది.

## కొత్తగా 12 డయాలసిస్ కేంద్రాల ఏర్పాటు: మంత్రి సత్యకుమార్



అమరావతి, (సువార్త ప్రతినిధి): రాష్ట్రంలో కిడ్నీ సమస్యలతో ఇబ్బంది పడుతున్న రోగులకు ప్రభుత్వం అండగా ఉంటుందని వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ వెల్లడించారు. శుక్రవారం రాజధాని అమరావతిలో ఆయన విలేకర్లతో మాట్లాడుతూ.. రాష్ట్రంలో కొత్తగా 12 డయాలసిస్ కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించారు. ప్రైవేట్ ఏజెన్సీకి టెండర్ ద్వారా వీటి నిర్వహణ చేపడతాయని తెలిపారు. ఇప్పటికే కూటమి పాలనలో 12 డయాలసిస్ కేంద్రాలు ఏర్పాటు చేశామని ఆయన గుర్తు చేశారు

అదనపు డయాలసిస్ కేంద్రాలతో కలిపి మొత్తం 73 కిడ్నీ సమస్యతో ఇబ్బంది పడుతున్నవారికి అందుబాటులోకి వచ్చాయని మంత్రి సత్యకుమార్ వివరించారు. 'ప్రైమ్ మినిస్టర్ నేషనల్ డయాలసిస్ ప్రోగ్రాం' కింద రాష్ట్రంలోని సెకండరీ ఆసుపత్రుల్లో (జిల్లా, ప్రాంతీయ, సామాజిక) 61 కేంద్రాలు నడుస్తున్నాయని వివరించారు. వీటికి అదనంగా ఈ 12 కేంద్రాలు వస్తున్నాయని తెలిపారు.

## మే 12న ఇంద్రకీలాద్రిపై హనుమాన్ జయంతి వేడుకలు

విజయవాడ,(సువార్త ప్రతినిధి): ప్రముఖ పుణ్యక్షేత్రం ఇంద్రకీలాద్రిపై మే 12న హనుమాన్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించనున్నారు. ఈ వేడుకల కోసం దుర్గగుడి అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు. మే 12న ఉదయం 6 గంటల నుంచి ప్రత్యేక పూజలు ప్రారంభంకానున్నాయి. ఆలయ ప్రాంగణంలో ఉన్న మూడు ఆంజనేయస్వామి ఆలయాల్లో విశేష పూజలు జరగనున్నాయి. అభయ ఆంజనేయస్వామి ఆలయంలో ప్రత్యేక అభిషేకాలు నిర్వహించనున్నారు. క్షేత్ర పాలక ఆంజనేయస్వామికి ఆకుపూజ కార్యక్రమం చేయనున్నారు.మెట్ల మార్గంలోని ఆంజనేయస్వామి ఆలయంలో అర్చకులు పూజలు నిర్వహించనున్నారు. నాగవల్లీ దళార్చన శాస్త్రోక్తంగా నిర్వహించనున్నారు. హనుమాన్ జయంతిని పురస్కరించుకుని పుష్పాలు, ప్రత్యేక దండలతో ఆలయాలను సర్వాంగ సుందరంగా అలంకరించనున్నారు. ఈ వేడుకలకు భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని దేవస్థానం పిలుపునిచ్చింది.

## ఈ-ఫైళ్ల పరిష్కారంలో అచ్చెన్నాయుడు నెంబర్ వన్

### పాలనలో సాంకేతికతను జోడిస్తున్న ఏపీ ప్రభుత్వం ఫైళ్ల క్లియరెన్స్‌లో వేగం పెంచడమే ప్రభుత్వ లక్ష్యం అచ్చెన్నాయుడి పనితనాన్ని ప్రశంసించిన చంద్రబాబు



అమరావతి, (సువార్త ప్రతినిధి): ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ పరిపాలనలో సాంకేతికతను జోడించి, ఫైళ్ల క్లియరెన్స్‌లో వేగాన్ని పెంచడంపై ముఖ్యమంత్రి చంద్రబాబు హర్షం వ్యక్తం చేశారు. ముఖ్యంగా వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు ఈ-ఫైళ్ల పరిష్కారంలో చూపిన చొరవ ఒక సరికొత్త రికార్డుకు దారితీసింది.గతంలో ఈ-ఫైళ్ల క్లియరెన్స్‌కు సగటున 5 గంటల సమయం పట్టేది. అయితే, మంత్రి అచ్చెన్నాయుడు తన శాఖకు సంబంధించిన ఫైళ్లను అత్యంత వేగంగా పరిశీలించి, ఆ సమయాన్ని 2 గంటల 49 నిమిషాలకు తగ్గించారు. పరిపాలనలో జాప్యాన్ని తగ్గించి, ప్రజలకు త్వరితగతిన సేవలు అందించడమే లక్ష్యంగా ఆయన పనిచేస్తున్న తీరును కలెక్టర్ల సమావేశంలో ముఖ్యమంత్రి ప్రత్యేకంగా ప్రశంసించారు. ప్రభుత్వ యంత్రాంగంలో ఈ-ఫైళ్ల విధానం అమలులోకి రావడం వల్ల ఫైళ్లు ఎక్కడ ఆగిపోయాయో ఎప్పటికప్పుడు పర్యవేక్షించే వీలుంటుంది. అచ్చెన్నాయుడు నాయకత్వంలో వ్యవసాయ శాఖ ఈ సాంకేతికతను సమర్థవంతంగా వాడుకుంటూ ముందంజలో ఉందని అధికారులు చెబుతున్నారు. రోజుల తరబడి పెండింగ్‌లో ఉండే ఫైళ్లు ఇప్పుడు గంటల వ్యవధిలోనే పరిష్కారం కావడం అనేది పాలనలో పారదర్శకతకు నిదర్శనం.ఒక మంత్రి స్థాయిలో ఫైళ్లు ఇంత వేగంగా క్లియర్ అవ్వడం వల్ల కింది స్థాయి అధికారులపై కూడా సానుకూల ప్రభావం పెరుగుతుంది. రైతులకు సంబంధించిన పథకాలు, రాయితీలు లేదా ఇతర అనుమతులు త్వరగా మంజూరు కావడానికి ఈ వేగం ఎంతగానో దోహదపడుతుంది.

## ఏపీ ఈసెట్ ఫలితాలను విడుదల చేసిన మంత్రి నారా లోకేశ్



అమరావతి, (సువార్త ప్రతినిధి): ఆంధ్రప్రదేశ్‌లో ఇంజినీరింగ్ కామన్ ఎంట్రన్స్ టెస్ట్ (ఏపీ ఈసెట్-2026) ఫలితాలు విడుదలయ్యాయి. రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ శుక్రవారం ఈ ఫలితాలను 'ఎక్స్' వేదికగా అధికారికంగా ప్రకటించారు. ఈ పరీక్షలో మొత్తం 91.72 శాతం ఉత్తీర్ణత నమోదైనట్లు ఆయన వెల్లడించారు. ఈ ఏడాది ఏప్రిల్ 23న రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించిన ఈ ప్రవేశ పరీక్షకు మొత్తం 32,434 మంది విద్యార్థులు హాజరు కాగా, వారిలో 29,750 మంది అర్హత సాధించారు. ఈసెట్‌లో అర్హత సాధించిన విద్యార్థులందరికీ మంత్రి లోకేశ్ శుభాకాంక్షలు తెలిపారు. పాలిటెక్నిక్, డిప్లొమా కోర్సులు పూర్తి చేసిన విద్యార్థులు నేరుగా బీటెక్, బీఈ కోర్సుల ద్వితీయ సంవత్సరంలో చేరేందుకు (లేటరల్ ఎంట్రీ) ఈసెట్ ప్రవేశ పరీక్షను నిర్వహిస్తారు. దీని ద్వారా విద్యార్థులు ఒక విద్యా సంవత్సరాన్ని ఆదా చేసుకునే అవకాశం కలుగుతుంది. ఈసెట్‌లో సాధించిన ర్యాంకు ఆధారంగా రాష్ట్రంలోని వివిధ ఇంజినీరింగ్ కళాశాలల్లో ప్రవేశాల ప్రక్రియ జరుగుతుంది.ఫలితాలు, ర్యాంకు కార్డులను విద్యార్థులు అధికారిక వెబ్‌సైట్ cets.apsche.ap.gov.in నుంచి డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. దీంతో పాటు, విద్యార్థులకు మరింత సౌలభ్యంగా ఉండేందుకు ప్రభుత్వం ఈసారి వాట్సాప్ సేవలను కూడా అందుబాటులోకి తెచ్చింది. తమ ఫోన్‌లోని వాట్సాప్ నుంచి 9552300009 నంబర్‌కు సందేశం పంపి కూడా ర్యాంకు కార్డును సులభంగా పొందవచ్చు.ఫలితాల విడుదల ప్రక్రియ పూర్తవడంతో, త్వరలోనే అడ్మిషన్ల కౌన్సెలింగ్ షెడ్యూల్‌ను ఉన్నత విద్యామండలి విడుదల చేయనుంది. విద్యార్థులు తదుపరి ప్రకటనల కోసం అధికారిక వెబ్‌సైట్‌ను గమనిస్తూ ఉండాలని అధికారులు సూచించారు.

## పెన్షన్స్‌పై ప్రభుత్వం కొత్త పాలసీ తీసుకురాబోతుంది: ఎంపీ శివనాథ్



విజయవాడ,(సువార్త ప్రతినిధి): పెన్షన్స్‌పై తమ ప్రభుత్వం కొత్త పాలసీ తీసుకురాబోతుందని తెలుగుదేశం పార్టీ విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని) వ్యాఖ్యానించారు. ఆయా సమస్యల పరిష్కారానికి కూటమి ప్రభుత్వం కృషి చేస్తోందని పేర్కొన్నారు. ప్రజాసమస్యల పరిష్కారంలో తమ ప్రభుత్వం ముందు వరుసలో ఉందని చెప్పుకొచ్చారు. తాము హామీ ఇచ్చిన సంక్షేమ పథకాలు అన్ని ఒక్కొక్కటిగా అమలు చేశామని వెల్లడించారు. ప్రజలంతా ఇది మంచి ప్రభుత్వమని అంటున్నారని తెలిపారు. ఈరోజు (శుక్రవారం) విజయవాడ లోని 45వ డివిజన్ ప్రజాదర్బార్ కార్యక్రమంలో ఎంపీ శివనాథ్ పాల్గొని మాట్లాడారు. జగన్ హయాంలో నేతలు, అధికారులు ఎవరు ప్రజల దగ్గరకు వెళ్లింది లేదని అన్నారు.

## విశాఖలో 'గూగుల్' పక్కన ఉన్న స్థలాల కోసం పోటీ ఏర్పడింది: శ్రీభరత్

అమరావతి, (సువార్త ప్రతినిధి): రాష్ట్రాభివృద్ధికి వైసీపీ అడ్డుపడుతోందని, ఏదైనా అభివృద్ధి జరిగితే అది తామే చేశామంటూ క్రెడిట్ తీసుకోవడానికి ప్రయత్నిస్తోందని టీడీపీ ఎంపీ శ్రీభరత్ విమర్శించారు. అభివృద్ధి పనుల విషయంలో ఆ పార్టీ కుట్రలు పన్నుతోందని, గతంలో తాము చేసిన పనులే ఇప్పుడు జరుగుతున్నట్లు నాటకాలు ఆడుతోందని ఆయన ఆరోపించారు. పారదర్శకత లేని రాజకీయాల వల్ల రాష్ట్రానికి నష్టం జరుగుతుందని ఆయన అభిప్రాయపడ్డారు.విశాఖపట్నం ఐటీ, పారిశ్రామిక హబ్‌గా మారుతోందని ఎంపీ ధీమా వ్యక్తం చేశారు. ప్రస్తుతం గూగుల్ వంటి దిగ్గజ సంస్థలు వస్తున్నాయని, వాటి సమీపంలోని స్థలాల కోసం మరికొన్ని అంతర్జాతీయ సంస్థలు పోటీ పడుతున్నాయని వెల్లడించారు. ఇప్పుడు వస్తున్న డేటా సెంటర్లు కేవలం ప్రారంభం మాత్రమేనని, భవిష్యత్తులో మరిన్ని భారీ పెట్టుబడులు రాబోతున్నాయని ఆయన పేర్కొన్నారు.భోగాపురం ఎయిర్‌పోర్టు పూర్తయితే రాష్ట్ర ఆదాయం గణనీయంగా పెరుగుతుందని, రెండు వైపులా రాకపోకలు సాగించే వెసులుబాటు ఉంటుందని తెలిపారు.

# మన కుటుంబం పట్ల దేవుని ఉద్దేశ్యం ఏమిటి?

## కుటుంబం గురించి బైబిల్ ఏమి చెబుతుంది?



(సువార్త ప్రతినిధి): మనం నిర్వచించినట్లే బైబిల్ కూడా కుటుంబాన్ని నిర్వచిస్తుంది -- అంటే ఒకే ఇంటిలో నివసించే భార్యాభర్తల జంట, వారి పిల్లలతో కూడినది. దేవుడు కుటుంబాన్ని సృష్టించాడు కాబట్టి, ఆయన ప్రతి ఒక్కరితో సన్నిహితంగా ఉంటాడు. ఏకపత్నీవ్రతం గురించి లేఖనమే మనకు గొప్ప బోధకుడు--- కుటుంబానికి పునాదిగా వివాహ బంధంలో ఒక పురుషుడు, ఒక స్త్రీ జీవితాంతం కలిసి ఉండటమే (ఆదికాండము 2:21-24). బైబిల్ అంతటా, దేవుడు సృష్టించిన ఆదర్శంగా కుటుంబ వ్యవస్థ ప్రబలంగా ఉంది; మిగతా అన్ని సంబంధాలు దేవుడు సమాజానికి పునాది వేసిన కుటుంబం నుండే ఉద్భవించాలి బైబిల్లో కుటుంబం ఎందుకు అంత ముఖ్యమైనది?దేవుడు తన చిత్తాన్ని నెరవేర్చడానికి చరిత్ర అంతటా కుటుంబాలను ఉపయోగిస్తాడు. ఆదికాండము 15:5లో దేవుడు అబ్రాహాముకు చేసిన వాగ్దానంలో కుటుంబం ఇమిడి ఉంది. "'ఆకాశము వైపు చూచి, నీవు లెక్కించగలిగిన యెడల నక్షత్రములను లెక్కించుము.' అప్పుడు ఆయన అతనితో, 'నీ సంతానము ఆలాగే ఉండును' అని చెప్పెను." అబ్రాహాము నిబంధన యొక్క తరువాతి వివరణలో మరిన్ని వివరాలు వెల్లడవుతాయి, దేవుడు అబ్రాహాముతో, తాను నిన్ను "అనేక జనములకు తండ్రిగా" చేశానని చెప్పాడు... "నేను నిన్ను జనములుగా చేస్తాను, మరియు నీ నుండి రాజులు వస్తారు." దేవుడు అబ్రాహాముతో మరియు అతని సంతానంతో తన నిత్య నిబంధనను స్థాపించాడు (ఆదికాండము 17:4-7). అలా లెక్కించడానికి వీలుకానింత పెద్ద కుటుంబం ప్రారంభమైంది. బైబిల్ ప్రకారం మన కుటుంబం ఎవరు? మన కుటుంబం కేవలం రక్త సంబంధమైనదేనా? సంతోషకరంగా, కాదు. క్రైస్తవులుగా, మనం యేసును మన ప్రభువుగా మరియు రక్షకుడిగా అంగీకరించి, ప్రకటించినప్పుడు, మనం రెండు రకాల కుటుంబ జీవితాన్ని పొందుతాము. ఒక రకంగా, మనకు రక్త సంబంధమైన కుటుంబాలు ఉన్నాయి (దేవుడు ఉద్దేశించిన విధంగా మనకు చెందినవారు), ఉదాహరణకు తల్లి, తండ్రి మరియు తోబుట్టువులు. రెండవ రకంగా, యేసుకు చెందిన ప్రజలుగా, మనం దేవుని కుటుంబంలోకి దత్తత తీసుకోబడ్డాము (రోమీయులు 8:16-17). ఈ భూమిపై ఇతర కుటుంబాలచే దత్తత తీసుకోబడిన క్రైస్తవులు మూడు రకాల కుటుంబంలో (రక్త సంబంధమైన, దత్తత తీసుకున్న మరియు దేవుని కుటుంబం) భాగం.కుటుంబం విషయంలో దేవుని ఉద్దేశ్యం ఏమిటి?ఆదికాండము 1:28లో ప్రభువు కుటుంబం యొక్క తన కారణాన్ని స్పష్టంగా తెలియజేశారు, "మీరు ఫలించి, అభివృద్ధి చెంది, భూమిని నింపి, దానిని లోబరచుకోండి. సముద్రపు చేపల మీద, ఆకాశపు పక్షుల మీద, భూమి మీద సంచరించే ప్రతి జీవి మీద మీరు అధికారం కలిగి ఉండండి." అబ్రాహాము కుటుంబానికి జరుగుతుందని దేవుడు చెప్పినట్లే, కుటుంబాలు భూమిని నింపాలి. మరియు ఆ ప్రక్రియను కొనసాగించడానికి, దేవుడు కుటుంబాల ద్వారా పుట్టిన ప్రతి ఒక్కరినీ వాడుకుంటాడు.

# ఎస్సీలను క్రిస్టియన్లుగా గుర్తించాలి....... పీ.వీ సునీల్ కుమార్



(సువార్త ప్రతినిధి): దశాబ్దాల క్రితం కారంచేడు, చుండూరు వంటి దారుణ ఘటనలు జరిగినప్పుడు మాల, మాదిగలు ఏకమై పోరాటం చేశారని, మళ్ళీ అదే ఐక్యతను చాటాల్సిన సమయం ఆసన్నమైందని మాజీ ఐపీఎస్ అధికారి పీవీ సునీల్ కుమార్ పేర్కొన్నారు. దశాబ్దాల క్రితం కారంచేడు , చుండూరు వంటి దారుణ ఘటనలు జరిగినప్పుడు మాల, మాదిగలు ఏకమై పోరాటం చేశారని, మళ్ళీ అదే ఐక్యతను చాటాల్సిన సమయం ఆసన్నమైందని మాజీ ఐపీఎస్ అధికారి పీవీ సునీల్ కుమార్ పేర్కొన్నారు. ఎస్సీల సమస్యలపై మందకృష్ణ మాదిగ తో కూడా చర్చలు జరిపినట్లు వెల్లడించిన ఆయన విభేదాలను పక్కన పెట్టి దళితులందరూ ఒకే తాటిపైకి రావాలని ఆకాంక్షించారు. ఉమ్మడి లక్ష్యం కోసం కలిసి అడుగులు వేస్తేనే సామాజిక న్యాయం సాధ్యమవుతుందని పీవీ సునీల్ కుమార్ స్పష్టం చేశారు. ఎస్సీల అభ్యున్నతికి సంబంధించి కీలక డిమాండ్లను ముందుకు తెస్తూ, ఎస్సీ వాడలను ప్రత్యేక పంచాయతీలుగా గుర్తించాలని సునీల్ కుమార్ డిమాండ్ చేశారు. దీనివల్ల స్థానికంగా పాలనాధికారం దక్కుతుందని ఆయన అభిప్రాయపడ్డారు. అలాగే ఎస్సీలను క్రిస్టియన్లుగా గుర్తించాలనే అంశాన్ని కూడా ఆయన ప్రస్తావించారు. దళితుల ఆత్మగౌరవం, హక్కుల రక్షణ కోసం ఐక్య పోరాటాలే శరణ్యమని పీవీ సునీల్ కుమార్ తెలిపారు.

# దళితుల జోలికి వస్తే ఉరుకోం.....మందకృష్ణ మాదిగ...



(సువార్త ప్రతినిధి): పశ్చిమ గోదావరి: ఆకివీడు పెద్ద పేట రామాలయం అంశంపై ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ స్పందించారు. దళిత వర్గాలకు చెందిన వారిని ఎవరు ఇబ్బంది పెట్టినా, ఆత్మ గౌరవం దెబ్బ తీసేలా వ్యవహరించినా ఊరుకునేది లేదని తేల్చి చెప్పారు. తమపై దాడి చేసే వాళ్లు ఏ స్థాయి వారైనా సరే ఉమ్మడిగా ఎదుర్కొంటామని హెచ్చరించారు. ఆకివీడు దళితవాడలోని గుడి విషయంలో కోర్టు తీర్పు కోసం ఎదురు చూస్తున్నట్లు కృష్ణ మాదిగ తెలిపారు. అక్కడ గొంతేనమ్మ గుడి, గ్రామ సావిడి, రామాలయం ఉందా? అనే అంశంలో న్యాయస్థానం తుది నిర్ణయం కోసం వేచి చూస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ వివాదమంతా ఉండి ఎమ్మెల్యే, ఏపీ డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజు చుట్టూ తిరుగుతోందన్నారు. ఈ కూటమి ప్రభుత్వ గెలుపులో తాము ప్రధాన భాగస్వాములుగా ఉన్నామని మందకృష్ణ గుర్తు చేశారు. రామాలయం వివాదాన్ని తానే స్వయంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దగ్గరకు తీసుకెళ్తానని చెప్పుకొచ్చారు. ఎమ్మెల్యేగా, డిప్యూటీ స్పీకర్గా మాట్లాడే మాటలు.. రఘురామ ఉన్న పార్టీకి మేలు చేయాలే తప్ప కీడు చేయకూడదని పేర్కొన్నారు. రాజ్యాంగబద్ధ పదవిలో రఘురామ ఉన్నారని.. ఆయన వ్యాఖ్యలు దళిత సమాజాన్ని పార్టీకి, ప్రభుత్వానికి దూరం చేసేవిగా ఉన్నాయన్నారు. ముఖ్యంగా దళితులను అవమానించే విధంగా డిప్యూటీ స్పీకర్ వ్యాఖ్యలు ఉన్నాయని మందకృష్ణ ఆగ్రహించారు.

# సింగపూర్‌లో చర్చికి వెళ్లే వారిపై చేయి చేసుకున్న వ్యక్తి.. అరెస్టు




(సువార్త ప్రతినిధి): చర్చిలో ప్రార్థనల సమయంలో భక్తులను చెంపదెబ్బ కొట్టినందుకు సింగపూర్‌లో ఒక వ్యక్తిని అరెస్టు చేశారు. ఆదివారం నాడు సింగపూర్ లైఫ్ చర్చికి అధికారులను పిలిచారు. 33 ఏళ్ల మలేషియన్-చైనీస్ వ్యక్తి చర్చికి తెలిసినవాడే మరియు గతంలో కూడా గొడవలకు కారణమయ్యాడు. ఎవరికీ తీవ్ర గాయాలు కాలేదు, కానీ 66 ఏళ్ల మహిళ కళ్ల దగ్గర దెబ్బ తగలడంతో రక్తస్రావం జరిగి, ఆమెను ఆసుపత్రికి తరలించారు. దర్యాప్తు కొనసాగుతోందని, అయితే సేవలకు ఎలాంటి అంతరాయం కలగలేదని పోలీసులు చెబుతున్నారు. సింగపూర్ లైఫ్ చర్చ్ తన లక్ష్య ప్రకటనలో ఇలా పేర్కొంది: "నిరంతర రక్షణ, మార్గదర్శకత్వం అందిస్తున్నందుకు, మరియు తన రాజ్యం కోసం మా చర్చిని ఒక సాధనంగా వాడుకుంటున్నందుకు దేవునికి కృతజ్ఞతలు".

# బైడెన్ హయాంలో క్రైస్తవ వ్యతిరేక పక్షపాతాన్ని వివరిస్తూ నివేదికను విడుదల చేసిన న్యాయ శాఖ ...



(సువార్త ప్రతినిధి): ట్రంప్ పరిపాలన విభాగం రూపొందించిన ఒక కొత్త నివేదిక ప్రకారం, బైడెన్ పరిపాలన విభాగం లౌకిక సంస్థలతో పోలిస్తే క్రైస్తవ సంస్థలు, వ్యక్తుల పట్ల చాలా కఠినంగా వ్యవహరించిందని వెల్లడైంది. దీనిని తాత్కాలిక యూ.ఎస్. అటార్నీ జనరల్ టాడ్ బ్లాంచే "క్రైస్తవుల విధ్వంసం"గా అభివర్ణించారు. యూ.ఎస్. న్యాయ శాఖ గురువారం "ఫెడరల్ ప్రభుత్వంలో క్రైస్తవ వ్యతిరేక పక్షపాతాన్ని నిర్మూలించడం" అనే పేరుతో ఒక నివేదికను విడుదల చేసింది. సుమారు 200 పేజీలు, 300 పేజీలకు పైగా సాక్ష్యాధారాలు కలిగిన ఈ నివేదికను, ట్రంప్ పరిపాలన విభాగానికి చెందిన 'క్రైస్తవ వ్యతిరేక పక్షపాతాన్ని నిర్మూలించే టాస్క్ ఫోర్స్' రూపొందించింది. "తమ విశ్వాసం కారణంగా ఫెడరల్ ప్రభుత్వం తమను శిక్షిస్తుందనే భయంతో ఏ అమెరికన్ కూడా జీవించకూడదు," అని 'క్రైస్తవ పక్షపాతాన్ని నిర్మూలించే టాస్క్ ఫోర్స్'కు అధ్యక్షుడిగా ఉన్న బ్లాంచే అన్నారు. "మా నివేదిక వివరిస్తున్నట్లుగా, బైడెన్ పరిపాలన చర్యలు చాలా మంది క్రైస్తవ అమెరికన్ల జీవితాలను నాశనం చేశాయి. ఆ విధ్వంసం అధ్యక్షుడు ట్రంప్‌తో ముగిసింది. క్రైస్తవులను లక్ష్యంగా చేసుకున్న దుష్ప్రవర్తకులను న్యాయ శాఖ బహిర్గతం చేస్తూనే ఉంటుంది మరియు విశ్వాసం గల అమెరికన్లందరికీ మత స్వేచ్ఛను పునరుద్ధరించడానికి అవిశ్రాంతంగా కృషి చేస్తుంది."ఈ నివేదికలోని ప్రధాన అంశాలలో ఒకటి ఏమిటంటే, బైడెన్ పరిపాలన తమ ఉదారవాద లేదా లౌకిక ప్రత్యర్థులతో పోలిస్తే, క్రైస్తవ సంస్థలు మరియు గర్భస్రావ వ్యతిరేక కార్యకర్తలపై అసమానమైన శిక్షలను విధించింది. ఈ నివేదిక ఫ్రీడమ్ ఆఫ్ యాక్సెస్ టు క్లినిక్ ఎంట్రన్సెస్ (ఫేూజజు) చట్టం కింద జరిగిన విచారణలను నమోదు చేసే గణాంకాలను ఉదహరిస్తుంది. ఈ చట్టం ప్రకారం, గర్భస్రావాలు చేసే లేదా చేయడంలో సహాయపడే ఏ వ్యక్తికైనా "ఉద్దేశపూర్వకంగా గాయం చేసినా, భయపెట్టినా, లేదా జోక్యం చేసుకున్నా, లేదా గాయం చేయడానికి, భయపెట్టడానికి లేదా జోక్యం చేసుకోవడానికి ప్రయత్నించినా" వారిపై ఫెడరల్ అభియోగాలు మోపబడతాయి.

# రెండవ బాంబు దాడితో ఉక్రెయిన్‌లో చర్చి భవనాన్ని ధ్వంసం చేసిన రష్యా



(సువార్త ప్రతినిధి): ఏప్రిల్ 25న తూర్పు ఉక్రెయిన్‌లోని ఒక చర్చి భవనంపై రష్యా బాంబు దాడి జరగడం ఇది రెండోసారి. 2014లో ఇదే ప్రదేశంలో ప్రార్థనల సమయంలో పాస్టర్ ఇద్దరు కుమారులను అపహరించి, చిత్రహింసలకు గురిచేసి, హత్య చేశారు. డాన్‌బాస్ ప్రాంతంలోని స్లోవియాన్స్క్‌లో ఉన్న 'ట్రాన్స్‌ఫిగరేషన్ ఆఫ్ ది లార్డ్ పెంటకోస్టల్ చర్చ్'కు చాలా సమీపంలో, 500 నుండి 1,500 కిలోల పేలుడు పదార్థాలు కలిగిన ఖూదీ-500యా-జు రకానికి చెందినదిగా భావిస్తున్న ఒక గైడెడ్ బాంబు పేలింది. ఈ ధాటికి చర్చి పైకప్పులో సగం, 80 శాతం తలుపులు, కిటికీలన్నీ కూలిపోయాయి. "ఆ పేలుడు ఎంత శక్తివంతంగా ఉందంటే, అది పైకప్పులోని చాలా భాగాన్ని వంచివేసి, కిటికీలు, తలుపులన్నింటినీ ఎగరగొట్టింది," అని మిఖా యిల్ పావెంకో 'క్రిస్టియన్ డైలీ ఇంటర్నేషనల్'కు తెలిపారు. అతని మామ, అలెగ్జాండర్ పావెంకో, స్లోవియాన్స్క్‌లోని ఆ చర్చిలో పాస్టర్‌గా పనిచేస్తున్నారు. అది పదుల కిలోమీటర్ల దూరం నుండి ప్రయోగించగల గైడెడ్ గ్లైడ్ బాంబులలో ఒకటి. అది చర్చికి సమీపంలోనే పడింది, మరియు ఆ పేలుడు నుండి వెలువడిన తరంగం, శకలాలు గణనీయమైన నష్టాన్ని కలిగించాయి.

# జిహాదీల దాడిలో చర్చి తగలబడిన తర్వాత, పెరుగుతున్న హింసపై హెచ్చరించిన బిషప్....



(సువార్త ప్రతినిధి): జిహాదీల దాడిలో ఒక చారిత్రాత్మక చర్చి ధ్వంసమైన తర్వాత, ఉత్తర మొజాంబిక్‌లో హింసను అంతం చేయాలని ఒక సీనియర్ చర్చి నాయకుడు పిలుపునిచ్చారు. కాబో డెల్గాడో ప్రావిన్స్‌లోని మిన్హోయెన్ గ్రామంలో ఉన్న సెయింట్ లూయిస్ డి మాంట్‌ఫోర్ట్ చర్చిపై జరిగిన దాడిని అనుసరించి, నంపులా ఆర్చ్‌బిషప్ ఇనాసియో సౌరే "విధ్వంసం మరియు హత్యలు" ఆగాలని అన్నారు. ఆయన ఇంకా ఇలా అన్నారు: "క్రైస్తవులపై ద్వేషాన్ని రెచ్చగొట్టడం ఆగిపోవాలి – అలాగే ఇస్లామోఫోబియాకు కూడా మనం తావు ఇవ్వకూడదు, ఎందుకంటే ముస్లింలు మన శత్రువులు కాదు, వారు మన ప్రియమైన సోదరులు."ఇస్లామిక్ స్టేట్ సెంట్రల్ ఆఫ్రికా ప్రావిన్స్‌తో సంబంధం ఉన్న మిలిటెంట్లు గత గురువారం పారిష్‌పై దాడి చేశారని క్యాథలిక్ స్వచ్ఛంద సంస్థ 'ఎయిడ్ టు ది చర్చ్ ఇన్ నీడ్' (ఏసీఎన్) తెలిపింది. ఎటువంటి మరణాలు సంభవించలేదు, కానీ చర్చి, పూజారుల నివాసం మరియు కార్యాలయాలు తగలబెట్టబడ్డాయి, మరియు ఒక ప్రీస్కూల్ ధ్వంసం చేయబడింది. పెంబా బిషప్ ఆంటోనియో జూలియాస్సే దానిని "భయానక దృశ్యం"గా వర్ణించారు."ఇళ్లు, మౌలిక సదుపాయాలు, అన్నీ ధ్వంసమయ్యాయి, మరియు చారిత్రాత్మక పారిష్ శిథిలమైపోయింది," అని ఆయన ఇంకా తెలిపారు. సాధారణ పౌరులను బంధించి, ద్వేషపూరిత ప్రసంగాలను చూడమని, వినమని బలవంతం చేశారు. 1946లో స్థాపించబడిన ఈ పారిష్, ముస్లింలు అధికంగా ఉన్న ఆ ప్రాంతంలోని అతికొద్ది కాథలిక్ కేంద్రాలలో ఒకటి. మిషనరీ పూజారులు అక్కడ లేరు మరియు క్షేమంగా ఉన్నారు, కానీ ఆ సమాజం ఇంకా దిగ్భ్రాంతిలోనే ఉంది. 2017లో ప్రారంభమైన మొజాంబిక్ ఇస్లామిస్ట్ తిరుగుబాటు, 6,300 మందికి పైగా ప్రజలను చంపి, కనీసం పది లక్షల మందిని నిరాశ్రయులను చేసింది. కనీసం 118 చర్చిలు ధ్వంసమయ్యాయి. బిషప్ ఆంటోనియో ప్రపంచవ్యాప్త మద్దతు కోసం పిలుపునిస్తూ, ఇలా అన్నారు: "దేవుని ప్రజల విశ్వాసం ఎన్నటికీ నశించదు – ప్రతిరోజూ అది పునర్నిర్మించబడుతుంది."


Source: https://premier christian. news/en/news/ article/bishop-warns-of-

# కృష్ణాజిల్లా నిడుమోలులో ఘనంగా జరిగిన 76వ వార్షిక బేతేలు బాప్టిస్ట్ క్రీస్తు సువార్త పండుగలు...






(సువార్త ప్రతినిధి): కృష్ణాజిల్లా నిడుమోలు లో 76వ వార్షిక బేతేలు బాప్టిస్ట్ క్రీస్తు సువార్త పండుగలు ఘనంగా ముగిశాయి.. ఏప్రిల్ 29. 30 మే 1,2,3 తారీకుల్లో ప్రతిరోజు ఉదయం 10 గంటలకు మరియు సాయంత్రం 6 గంటలకు జరిగినటువంటి ఈ పండుగలు లో పెద్ద ఎత్తున క్రైస్తవ విశ్వాసులు పాల్గొని ప్రార్థన చేశారు, దూర ప్రాంతం నుంచి వచ్చినటువంటి దేవుని సేవకులు =వజ.ణతీ.ణ.జీ ఆగస్టీన్ గారు, =వజ. జోసెఫ్ ప్రకాష్ గారు,=వజ దీ. శామ్యూల్ సాజన్ కుమార్ గారు అద్భుతమైన వర్తమానాలు చెప్పి క్రీస్తు ప్రేమను ప్రకటించారు, ఈ పండుగలు చాట్ల లూథర్ గారి యొక్క అధ్యక్షతన , నిడుమోలులోని డా .చాట్ల దేవసహం మెమోరియల్ షాలోమ్ గ్రౌండ్స్ నందు మే 3 తేదీన ఈ యొక్క పండుగలు ఘనంగా ముగిశాయి...



# ప్రైవేట్ విద్యాసంస్థల అక్రమాలపై గళమెత్తిన విద్యార్థి సంఘాలు.


## గుంతకల్లులో నిబంధనలు ఉల్లంఘిస్తున్న పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్

## విద్యా హక్కు చట్టం అమలు కావడం లేదని ఆగ్రహం




గుంతకల్లు (సువార్త ప్రతినిధి): గుంతకల్లు పట్టణంలో ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థలు ప్రభుత్వ నిబంధనలను పట్టించుకోకుండా అక్రమ ప్రవేశాలు నిర్వహిస్తున్నాయని ఆరోపిస్తూ పీడీఎస్‌యూ, ఏవీఎస్ విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. సీపీఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ కార్యాలయంలో జరిగిన ఈ సమావేశంలో విద్యార్థి సంఘాల నాయకులు ప్రభుత్వ అధికారుల నిర్లక్ష్యంపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ విద్యా సంవత్సరం ప్రారంభం కాకముందే ప్రైవేట్ విద్యాసంస్థలు ఇంటింటికీ తిరుగుతూ ప్రవేశాల కోసం ప్రచారం నిర్వహిస్తున్నాయని ఆరోపించారు. అనేక విద్యాసంస్థలు సరైన భవన అనుమతులు, అగ్నిమాపక భద్రత ధ్రువపత్రాలు, పారిశుధ్య అనుమతులు లేకుండానే కొనసాగుతున్నాయని తెలిపారు. విద్యా హక్కు చట్టం ప్రకారం పేద విద్యార్థులకు కేటాయించాల్సిన 25 శాతం ఉచిత సీట్లను ఏ ఒక్క ప్రైవేట్ విద్యాసంస్థ కూడా అమలు చేయడం లేదని విమర్శించారు. మరోవైపు అధిక రుసుములు వసూలు చేస్తూ తల్లిదండ్రులను ఆర్థికంగా ఇబ్బందులకు గురిచేస్తున్నారని పేర్కొన్నారు. పుస్తకాలు, దుస్తులు, ఇతర విద్యాసామగ్రి పేరుతో కూడా అదనపు భారాలు మోపుతున్నారని ఆరోపించారు. గుంతకల్లు మండల విద్యాశాఖ అధికారి మస్తాన్‌రావు రెండున్నర సంవత్సరాలుగా పట్టణంలో కొనసాగుతున్న అక్రమాలపై ఎలాంటి చర్యలు తీసుకోలేదని విద్యార్థి సంఘాల నాయకులు మండిపడ్డారు. పలుమార్లు సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లినా స్పందన లేకపోవడం దురదృష్టకరమన్నారు. ప్రైవేట్ విద్యాసంస్థల అక్రమాలను అరికట్టి విద్యార్థులు, తల్లిదండ్రులకు న్యాయం చేయాలని, నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న మండల విద్యాశాఖ అధికారిపై చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. సమస్యలు పరిష్కరించకపోతే పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. ఈ సమావేశంలో షేక్ వసీం, బి.భరత్, బి.రాజేష్, డి.ఆజాద్ వలి, సాయి, కమల్, అరవింద్, సుభాష్, గౌతమ్, ప్రతాప్, అర్జున్, సంతోష్, శ్రీకర్ తదితర నాయకులు పాల్గొన్నారు.

# ఆకివీడు మండలం తాళ్లకోడులో చర్చిలు పరిశీలించిన డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణంరాజు..



(సువార్త ప్రతినిధి): ఆకివీడు మండలం కుప్పనపూడి శివారు తాళ్లకోడులోని ఎన్టీఆర్ కాలనీలో నిర్వహిస్తున్న చర్చిలను డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణంరాజు బుధవారం పరిశీలించారు. నివాస ప్రాంతాల్లో నిబంధనలకు విరుద్ధంగా చర్చిలు నిర్వహిస్తున్నట్లు గుర్తించిన ఆయన.. వాటిని వెంటనే తొలగించాలని తహశీల్దార్, సీఐలను ఆదేశించారు. మొత్తం ఎన్ని చర్చిలు నడుస్తున్నాయో పూర్తిస్థాయిలో విచారణ జరిపి నివేదిక సమర్పించాలని అధికారులకు సూచించారు....

# రైతు సేవకే ప్రధమ ప్రాధాన్యం: ఎమ్మెల్యే బొలిశెట్టి





(తాడేపల్లిగూడెం నియోజకవర్గం

(సువార్త ప్రతినిధి):–కళింగ లక్ష్మణరావు ): మే 8: రైతుల సమస్యలన్నీ పరిష్కరించి వారి సేవకే ప్రథమ ప్రాధాన్యం ఇస్తామని శాసనసభ్యులు,రాష్ట్ర ప్రభుత్వ విప్ బొలిశెట్టి శ్రీనివాస్ అన్నారు. తాడేపల్లిగూడెం మండలం మోదుగ గుంట గ్రామంలోగురువారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహించారు.పట్టాదారు పాసు పుస్తకాల పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత వైసిపి హయాంలో రైతులను నిర్లక్ష్యం చేశారని కనీసం పండించిన పంటకు డబ్బులు కూడా రాని పరిస్థితి ఏర్పడిందని విమర్శించారు . కూటమి ప్రభుత్వం వచ్చిన వెంటనే ముఖ్యమంత్రి చంద్రబాబు,ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ రైతు సమస్యల పరిష్కారానికి ప్రధమ ప్రాధాన్యం ఇచ్చారని అన్నారు. పట్టాదారు పాస్ పుస్తకాలపై రాజముద్ర తో పంపిణీ చేశారన్నారు. రైతు బాగుంటే రాష్ట్రం బాగుంటుందనే ఆలోచనతో ప్రభుత్వం పనిచేస్తుందన్నారు. ఒక రూపాయి కూడా అవినీతికి తావు లేకుండా ప్రభుత్వ ఉద్యోగులు సేవలు అందించే విధంగా చర్యలు చేపట్టామన్నారు. ఎమ్మెల్యే కార్యాలయం నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉంటుందని ప్రజలకు ఎలాంటి సమస్య వచ్చినా కార్యాలయంలో పది మంది ఉద్యోగులు సిద్ధంగా ఉంటారని ఆయన తెలియజేశారు. దేశంలో బిజెపి ప్రభుత్వం ప్రధాని మోడీ నాయకత్వంలో సమర్థవంతంగా పనిచేస్తుందని అన్నారు. ప్రపంచమంతా యుద్ధ భయంతో,రకరకాల సమస్యలతో ఉందని మోడీ నాయకత్వంలో భారతదేశం మాత్రం ప్రశాంతంగా అభివృద్ధి పథంలో పయమిస్తుందని అన్నారు. కులం మతం అంటూ మూఢ నమ్మకాలతో ఆలోచించకుండా ప్రజలకు మేలు చేసే కూటమి ప ప్రభుత్వానికి ప్రతి ఒక్కరు అండగా నిలవాలని ఈ సందర్భంగా ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో ఎండిఓ చంద్రశేఖర్,స్పెషల్ ఆఫీసర్ మల్లికార్జున్, ఎమ్మార్వో రాజరాజేశ్వరి,ఈతకోట తాతాజీ, అడపా ప్రసాద్, చాపల రమేష్, పుల్ల బాబి, సిద్ధ వీరన్న, మద్దాల మణికుమార్, వాడపల్లి సుబ్బరాజు, పసుమర్తి రామ లక్ష్మణ్, కట్ట జానకి రామయ్య, దండుపోయిన వెంకటరమణ, ఏపూరి సత్యనారాయణ, వల్లేపల్లి సత్యనారాయణ, కూటమి నాయకులు పాల్గొన్నారు

# సంపాదకీయం

## కాలాన్ని జయించిన ‘సోమనాథ్’

సోమనాథ్ ఆలయంపై మొదటి దాడి జరిగి వెయ్యేళ్లు పూర్తయిన నేపథ్యంలో, ‘సోమనాథ్ స్వాభిమాన పర్వ్’ను పురస్కరించుకుని 2026 ప్రారంభంలో నేనక్కడికి వెళ్లాను. ఇప్పుడు మరోసారి సోమనాథ్‌ను దర్శించుకోబోతున్నాను. పునర్నిర్మించిన సోమనాథ్ ఆలయాన్ని అప్పటి రాష్ట్రపతి డాక్టర్ రాజేంద్రప్రసాద్ ప్రారంభించి 75 వసంతాలు నిండిన సందర్భంగా మే 11న ఆ పావన క్షేత్రానికి వెళ్తున్నాను. ఆరు నెలలలోపే సోమనాథ్ క్షేత్రానికి సంబంధించి రెండు మహత్తర ఘట్టాల్లో పాల్గొనడం, విధ్వంసం నుంచి సృజన దిశగా సోమనాథ్ మహోజ్వల ప్రస్థానంలో భాగస్వామినవడం నిజంగా నా అదృష్టం.

నాగరికతకు సంబంధించి సోమనాథ్ మనకు ఒక సందేశాన్ని అందిస్తోంది. ఆలయం ముందున్న విశాల సముద్రం అమరత్వాన్ని ఆవిష్కరిస్తోంది. తుఫానులెంత భీకరంగా ఉన్నా, అలలు కల్లోలం చేసినా.. ఆత్మగౌరవంతో, శక్తితో పునరుత్తేజాన్ని పొందగలమని సముద్రుని అలలు మనకు చెబుతున్నాయి. ప్రజా చేతనను ఎంతోకాలం అణచిపెట్టలేమని ప్రతి తరానికీ ఈ సాగరం చెబుతున్నట్లుగా అలలు తిరిగి తీరాన్ని చేరుతున్నాయి.మన ప్రాచీన గ్రంథాలిలా చెబుతున్నాయి ▪ ‘ప్రభాసం చ పరిక్రమ్య పృథివీక్రమసంభవమ్’. అంటే దివ్యమైన ప్రభాస క్షేత్రం (సోమనాథ్)లో ఒకసారి ప్రదక్షిణ చేస్తే, ఈ భూమండలం చుట్టూ ఒకసారి ప్రదక్షిణ చేసినట్టే! ప్రార్థనల కోసం ఇక్కడికొచ్చే భక్తులు.. శాశ్వతమై, దేదీప్యమై వెలుగొందుతున్న ఈ అద్భుతమైన నాగరికతా ప్రవాహాన్ని అనుభవంలోకి తెచ్చుకుంటారు. ఎన్నో రాజ్యాలు వచ్చాయి... అంతరించిపోయాయి. కాలం మారింది. విజయాలు, వినాశనాల మధ్య నుంచి చరిత్ర సాగిపోయింది. అయినా సోమనాథ్ మన చేతనలో అచంచలంగా నిలిచే ఉంది.నిరంకుశత్వాన్ని ఎదిరించి దృఢంగా నిలిచిన మహనీయులనెందరినో స్మరించుకోవాల్సిన తరుణమిది. లకులిస, సోమశర్మ ఈ ప్రభాస క్షేత్రాన్ని గొప్ప తాత్విక కేంద్రంగా నిలిపారు. వల్లభి చక్రవర్తి మహారాజ నాలుగో ధారసేనుడు శతాబ్దాల కిందటే అక్కడ రెండో ఆలయాన్ని నిర్మించాడు. దండయాత్రలకు ఎదురొడ్డి మన నాగరికతా గౌరవాన్ని నిలబెట్టిన భీమదేవుడు, జయపాలుడు, ఆనందపాలుడు సదా స్మరణీయులు. భోజరాజు కూడా పునర్నిర్మాణానికి సాయం చేశాడని చెబుతారు. గుజరాత్ రాజకీయ, సాంస్కృతిక శక్తిని పునరుద్ధరించడంలో కర్ణదేవుడు, సిద్ధరాజ జయసింహుడు కీలక పాత్ర పోషించారు. భావ బృహస్పతి, కుమారపాల సోలంకి, పాశుపతాచార్యులు ఈ మందిరాన్ని పునర్నిర్మించి.. ఒక గొప్ప ఆరాధన, విద్యాకేంద్రంగా నిలిపారు. విశాలదేవ వాఘేలా, త్రిపురాంతకుడు ఇక్కడి ఆధ్యాత్మిక, మేధో పరంపరను రక్షించారు. ఆలయ విధ్వంసం తర్వాత తిరిగి పూజలు మొదలుపెట్టి మహీపాలదేవుడు, రా ఖంగార్ కీలకంగా నిలిచారు. ప్రస్తుతం 300వ జయంత్యుత్సవాలు జరుగుతున్న పుణ్యశ్లోక అహల్యాబాయి హోల్కర్ అత్యంత క్లిష్ట సమయాల్లోనూ నిరంతరం ఆరాధన కొనసాగేలా చూసి, సోమనాథుని పట్ల భక్తి ప్రపత్తులను చాటుకున్నారు. యాత్రికుల హక్కులను కాపాడడంలో బరోడా గైక్వాడ్‌లు విశేష కృషి చేశారు. ఎంతో మంది వీరులను కన్న ఈ పుణ్యభూమిలో వీర హమీర్జీ గోహిల్, వీర వేగ్డాజీ భిల్ వంటి సాహసమూర్తుల త్యాగం, ధైర్యసాహసాలు.. సోమనాథుడికి సంబంధించి చెరగని జ్ఞాపకాలు.దేశమంతటా స్వాతంత్ర్యకాంక్ష వెల్లువెత్తుతున్న 1940వ దశకంలో, సర్దార్ పటేల్ వంటి మహోన్నత నాయకుల సారథ్యంలో నవభారత గణతంత్రానికి పునాదులు పడుతున్న వేళ.. ఒక విషయం ఆయనను నిరంతరం కలచివేసింది. అదే సోమనాథ్ ఆలయ స్థితి. అది 1947 నవంబర్ 13. ఆ రోజు దీపావళి. శిథిలావస్థలో ఉన్న ఆ ఆలయ ప్రాంగణంలో నిలబడి, సముద్ర జలాలను చేతిలో తీసుకుని ఆయన ఇలా ప్రకటించారు ▪ ‘సోమనాథ్ ఆలయాన్ని పునర్నిర్మించాలని ఈ (గుజరాతీ) నూతన సంవత్సర శుభవేళ మేం సంకల్పించాం. సౌరాష్ట్ర వాసులారా.. ఇందుకోసం మీరు శక్తివంచన లేకుండా కృషిచేయాలి. అందరూ భాగస్వాములు కావాల్సిన పవిత్ర యజ్ఞమిది’. సర్దార్ పటేల్ పిలుపుతో గుజరాత్ ప్రజలే కాదు, యావద్భారతమూ ఎంతో ఉత్సాహంగా స్పందించింది.కానీ విధివశాత్తూ తానెంతగానో తపించిన ఆ కల సాకారమవడాన్ని సర్దార్ పటేల్ వీక్షించలేకపోయారు. పునర్నిర్మించిన సోమనాథ్ ఆలయ ద్వారాలు ఇంకా భక్తుల కోసం తెరుచుకోకముందే ఆయన ఈ లోకాన్ని వీడారు. అయినప్పటికీ, ఆ ప్రభాస పట్టణ పవిత్ర తీరంలో ఆయన స్ఫూర్తి సజీవంగా నిలిచే ఉంది. ఆయన ఆశయాన్ని కె.ఎం.మున్షీ ముందుకు తీసుకెళ్లగా.. నవానగర్ జామ్‌సాహెబ్ ఆయనకు వెన్నుదన్నుగా నిలిచారు. 1951లో ఆలయ నిర్మాణం పూర్తయ్యాక ప్రాణప్రతిష్ఠ మహోత్సవానికి భారత రాష్ట్రపతి డాక్టర్ రాజేంద్రప్రసాద్‌ను ఆహ్వానించాలని నిర్ణయించారు. నాటి ప్రధానమంత్రి జవహర్‌లాల్ నెహ్రూ ఎంత వ్యతిరేకించినా, వాటన్నింటినీ అధిగమించి డాక్టర్ రాజేంద్రప్రసాద్ ఈ వేడుకకు విచ్చేయడంతో ఆ ఘట్టం మరింత ప్రత్యేకంగా, చరిత్రాత్మకంగా నిలిచింది.ముఖ్యమంత్రిగా నేను బాధ్యతలు స్వీకరించిన 2001 అక్టోబర్ నెల నాకు గుర్తొస్తోంది. సోమనాథ్ ఆలయం తలుపులు తెరుచుకొని 50 ఏళ్లు పూర్తయిన సందర్భంగా ఓ ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించే అవకాశం గుజరాత్ ప్రభుత్వానికి వచ్చింది. అదే రోజు అంటే, 2001 అక్టోబర్ 31 సర్దార్ పటేల్ 125వ జయంత్యుత్సవాలను నిర్వహించడం యాదృచ్ఛికం. అప్పటి ప్రధానమంత్రి అటల్ బిహారీ వాజపేయి, హోం మంత్రి ఎల్‌కే ఆడ్వాణీ ఈ కార్యక్రమానికి హాజయ్యారు. తిరుగులేని విశ్వాసం, ప్రేమతో కూడిన దేనినైనా నాశనం చేయలేమని సోమనాథ్ ఆలయం ప్రపంచానికి చాటిచెబుతోందని 1951, మే 11న చేసిన ప్రసంగంలో డాక్టర్ రాజేంద్రప్రసాద్ అన్నారు. ప్రజల హృదయాల్లో ఈ దేవాలయం చిరస్థాయిగా నిలిచిపోతుందనే విశ్వాసాన్ని వ్యక్తం చేశారు. ఆలయ పునరుద్ధరణతో సర్దార్ పటేల్ కల నెరవేరిందనీ, అయితే ఈ స్ఫూర్తిని ముందుకు తీసుకెళ్లి ప్రజల జీవితాల్లో సంక్షేమాన్ని పునరుద్ధరించడం అత్యంత ముఖ్యమైనదనీ ఆయన చెప్పారు. ఇవన్నీ ఆయన అందించిన ముఖ్యమైన, స్ఫూర్తిదాయకమైన సందేశాలు.దశాబ్ద కాలానికి పైగా మేం నడుస్తున్న మార్గమిదే. ‘వికాస్ భీ, విరాసత్ భీ’ అనే సూత్రం నుంచి స్ఫూర్తి పొంది సోమనాథ్ నుంచి కాశీ వరకు, కామాఖ్య నుంచి కేదార్‌నాథ్ వరకు, అయోధ్య నుంచి ఉజ్జయిని వరకు, త్రయంబకేశ్వర్ నుంచి శ్రీశైలం వరకు మన ఆధ్యాత్మిక కేంద్రాల సంప్రదాయ స్వరూపాన్ని కాపాడుతూనే.. అత్యాధునిక సౌకర్యాలతో తీర్చిదిద్దే అవకాశం మా బృందానికి లభించడం అదృష్టంగా భావిస్తున్నాను.

## శాఖ గ్రంథాలయలలో సమ్మర్ క్యాంప్ లు సంతృప్తికరం..

### గ్రంథాలయ సంస్థ చైర్మెన్ జుత్తుగ నాగరాజు వెల్లడి..



ద్వారకాతిరుమల, (సువార్త ప్రతినిధి): ద్వారకాతిరుమల శాఖా గ్రంథాలయం ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్మన్ మరియు ఉండి నియోజకవర్గ జనసేన పార్టీ అధ్యక్షులు జుత్తుగ నాగరాజు ఆకస్మికంగా తనిఖీ చేశారు. ముందుగా ద్వారకాతిరుమల శ్రీ వెంకటేశ్వర స్వామి వారిని దర్శించుకున్న ఆయన అనంతరం ఈ శాఖ గ్రంథాలయాన్ని సందర్శించి అక్కడి సదుపాయాలు, పుస్తకాల వివరాలు, సమ్మర్ క్యాంప్ నిర్వహణపై సమీక్ష నిర్వహించారు. ఆంధ్రప్రదేశ్ ఐటీ మరియు విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ఆదేశాల మేరకు రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహిస్తున్న సమ్మర్ క్యాంప్ కార్యక్రమం దాదాపు 40 రోజుల పాటు కొనసాగనున్నట్లు నాగరాజు తెలిపారు. వేసవి సెలవుల్లో విద్యార్థులు ఎండలకు తిరగకుండా, మొబైల్ ఫోన్లు ,టీవీలు వీక్షించకుండా గ్రంథాలయాలకు వచ్చి పోటీ పరీక్షలకు సంబంధించిన పుస్తకాలు చదవడంతో పాటు జ్ఞానాన్ని పెంపొందించుకోవచ్చని చెప్పారు.అదేవిధంగా విద్యార్థుల కోసం చెస్, క్యారమ్స్ వంటి మేధోపరమైన కార్యక్రమాలు కూడా నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. ఈ శాఖ గ్రంథాలయంలో ఉన్న పుస్తకాల సంఖ్య, సదుపాయాలు, విద్యార్థులకు అందుతున్న వసతులను పరిశీలించేందుకే ఈ తనిఖీ నిర్వహించినట్లు తెలిపారు. తనిఖీల అనంతరం గ్రంథాలయంలో నిర్వహణ, విద్యార్థుల హాజరు, సమ్మర్ క్యాంప్ కార్యక్రమాలపై ఆయన సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా లైబ్రేరియన్ రామకృష్ణ మాట్లాడుతూ, సంస్థ చైర్మెన్ శాఖ గ్రంథాలయాన్ని సందర్శించడం ఆనందంగా ఉందని, మరిన్ని సదుపాయాలు కల్పిస్తే ఇంకా ఎక్కువ మంది విద్యార్థులు ఈ అవకాశాన్ని వినియోగించుకుంటారని తెలిపారు. దీనిపై స్పందించిన సంస్థ చైర్మెన్ నాగరాజు, విద్యార్థులకు అవసరమైన పుస్తకాలు లేదా వసతుల గురించి తెలియజేస్తే సానుకూలంగా స్పందిస్తానని హామీ ఇచ్చారు.

ఈ కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు.

## వైద్య మిత్రాల జీతాలు వెంటనే చెల్లించాలి : సిఐటియు డిమాండ్

అమరావతి :(సువార్త ప్రతినిధి): వైద్య మిత్రాల జీతాలు వెంటనే చెల్లించాలని సిఐటియు ఎపి రాష్ట్ర కమిటీ డిమాండ్ చేసింది. డాక్టర్ ఎన్టీఆర్ వైద్య సేవ పథకంలో వైద్యమిత్రాలు టీం లీడర్లు, డిస్ట్రిక్ మేనేజర్లు కలిపి మొత్తం 2000 మంది సిబ్బంది పనిచేస్తున్నారని సిఐటియు అధ్యక్షులు సి.హెచ్ నరసింగరావు, ప్రధాన కార్యదర్శి ఎ.వి.నాగేశ్వరరావులు పేర్కొన్నారు. డాక్టర్ ఎన్టీఆర్ వైద్య సేవ పథకంలో పనిచేస్తున్న వారందరికి మార్చి నుండి జీతాలు చెల్లించలేదని, వేతన బకాయిలు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. 18 సంవత్సరాల నుండి వీరు అతి తక్కువ వేతనాలతో పనిచేస్తున్నారని, ఆ జీతాలు కూడా నెల నెలా రాక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. సమస్యలను అధికారులు దృష్టికి ఫోన్ ద్వారా తెలియజేసిన బడ్జెట్ రాలేదని సాకులు చెప్తున్నారని మండిపడ్డారు. కూటమి ప్రభుత్వం, వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్య కుమార్ యాదవ్, ఎన్టీఆర్ వైద్య సేవ ట్రస్ట్ ముఖ్య కార్యనిర్వహణ అధికారి, తక్షణమే స్పందించి డాక్టర్ ఎన్టీఆర్ వైద్య సేవ పథకంలో పనిచేస్తున్న వైద్యమిత్రాల జీతాలు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు.

## వేర్వేరు కేసుల్లో ముగ్గురు అరెస్ట్ 50 లక్షల చోరీ సొత్తు స్వాధీనం

(సువార్త ప్రతినిధి): జిల్లాలో వరుస చైన్ స్నాచింగ్‌లు, ఇంటి దొంగతనాలు, మోటార్ సైకిల్ చోరీలకు పాల్పడుతున్న ముగ్గురు నిందితులను కాకినాడ పోలీసులు అరెస్ట్ చేశారు. వారి వద్ద నుంచి 50 లక్షల 16 వేల విలువైన బంగారం, వెండి వస్తువులు, నగదు, మోటార్ సైకిళ్లను స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసులకు సంబంధించి జిల్లా ఎస్పీ జి బిందు మాధవ్ విలేకరులకు వివరాలను తన కార్యాలయంలో వెల్లడించారు. కాకినాడ-2 టౌన్, సర్పవరం, పిఠాపురం, ఇంద్రపాలెం, కోరింగ పోలీస్ స్టేషన్ల పరిధితో పాటు కోనసీమ జిల్లా దాక్షారామం లో నమోదైన 12 కేసులను పోలీసులు ఛేదించగా వీటిలో ఏడు చైన్ స్నాచింగ్‌లు, రెండు ఇంటి దొంగతనాలు, ఒక ఏటీఎం కార్డు మోసం, రెండు మోటార్ సైకిల్ చోరీ కేసులు ఉన్నాయన్నారు. చైన్ స్నాచింగ్ కేసుల్లో అరెస్టైన పల్లా సురేంద్ర కుమార్, రంగాల శ్రీనివాసరెడ్డి వద్ద నుంచి 320 గ్రాముల బంగారం, 600 గ్రాముల వెండి, 40 వేల నగదు, ఒక ద్విచక్రవాహనాన్ని స్వాధీనం చేసుకున్నామన్నారు. వీటి విలువ 46 లక్షల 50 వేల రూపాయలని ఎస్పీ చెప్పారు. మరో నిందితుడు రచ్చ నాగ సతీష్ కుమార్ అలియాస్ బబ్లు వద్ద నుంచి 430 గ్రాముల వెండి, మూడు మోటార్ సైకిళ్లను స్వాధీనం చేసుకున్నారు. వీటి విలువ 3 లక్షల 66 వేల వరకు ఉంటుందని చెప్పారు.

నిందితులు ఒంటరిగా వెళ్తున్న మహిళలు, వృద్ధ మహిళలను లక్ష్యంగా చేసుకుని చైన్ స్నాచింగ్‌లకు పాల్పడుతున్నట్లు తెలిపారు. ఏటీఎంల వద్ద వృద్ధులకు సహాయం చేస్తున్నట్లు నటించి కార్డులు మార్చి నగదు దోచుకునే వారని పేర్కొన్నారు. తాళాలు వేసి ఖాళీగా ఉన్న ఇళ్లను గుర్తించి దొంగతనాలు చేయడం, బయట పార్క్ చేసిన మోటార్ సైకిళ్లను దొంగిలించడం వీరి నేర ప్రవృత్తి గా వెల్లడైందన్నారు. బంగారు



గొలుసు దొంగతనాల ముద్దాయిలను బుధవారం సామర్లకోట రోడ్ లోను, మోటార్ సైకిల్ దొంగతనం కేసులో ముద్దాయిని వలసపాకలలో అరెస్ట్ చేసినట్టు చెప్పారు. విహార యాత్రలకు ఇల్లు వదిలి దూర ప్రాంతాలకు వెళ్లేటప్పుడు స్థానిక పోలీసులకు తెలియజేస్తే తాము వచ్చి ఎల్ హెచ్ఎంఎస్ అనే పరికరాన్ని అమర్చుతామని దానిని వినియోగికోవాలని ఎస్పీ సూచించారు.

ఈ కేసులను ఛేదించిన ఏఎస్పీ పాటిల్ దేవరాజ్ మనీష్, ఎస్బి డిఎస్పి కెవివి సత్యనారాయణ, సీసీఎస్ సీఐ వి కృష్ణ, కాకినాడ టూ టౌన్ సిఐ ఆర్ అప్పలనాయుడు, సామర్లకోట క్రైమ్ సీఐ ఆర్ అంకబాబు, కాకినాడ-2 టౌన్ ఎస్ఐ బుజ్జిబాబు, సర్పవరం ఎస్ఐ ఎం ఏసుబాబు, సిబ్బందిని జిల్లా ఎస్పీ బిందు మాధవ్ అభినందించారు.

## ఇష్టారాజ్యంగా కూరగాయలు ధరలు

పత్తికొండ (సువార్త ప్రతినిధి): సామాన్యుడికి కూరగాయలు కూడా అందని ద్రాక్షగా మారాయి. పత్తికొండలో కూరగాయల నిర్వాహకులు ఇష్టారాజ్యంగా కూరగాయల ధరలు పెంచడంతో సామాన్య ప్రజలు కొనుగోలు చేయడానికి ఇబ్బంది పడుతున్నారు. రోజురోజుకు బహిరంగ మార్కెట్ లో కూరగాయల ధరలు కిలో టమోటా 50, పచ్చిమిరప 60, ఉర్ల గడ్డలు 40, బెండకాయ 40,క్యారెట్ 60,ముల్లంగి 60, ఎర్రగడ్డ 40, వంకాయ 50, క్యాబేజీ 60, పూతగడ్డ 40 ధరలు పెరిగాయి. కూరగాయల ధరలు పెరగడంతో పాటు పూట గడవడానికి ఇబ్బందిగా ఉందంటూ ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మార్కెట్లలో కూరగాయలు పండించే రైతుల కు గిట్టుబాటు ధర లభించడం లేదు. కూరగాయల నిర్వాహకులు ధరల పట్టిక ఏర్పాటు చేయకపోవడంతో పాటు ఇష్టారాజ్యంగా ధరల పెంచుతున్నారని ప్రజలు ఆవేదన వ్యక్తం చేశారు. కూరగాయల నిర్వాహకులు, పర్యవేక్షణ అధికారులు కుమ్మక్కై అమాయక ప్రజల నుండి సొమ్ము ను దోపిడీ చేస్తున్నారని ప్రజలు మండిపడుతున్నారు. ఇప్పటికైనా ధరల నియంత్రణపై సమగ్ర విచారణ చేపట్టి నిర్వాహకులకు చర్యలు తీసుకోవాలని ప్రజల డిమాండ్ చేస్తున్నారు.



# రెండేళ్లలో 3 వేల ఈవీ బస్సులు



హైదరాబాద్ (సువార్త ప్రతినిధి): గ్రేటర్‌లో రాబోయే రెండేళ్లలో 3 వేల ఈవీ (ఎలక్ట్రికల్ వెహికిల్) బస్సులు నడుపాలని ఆర్టీసీ లక్ష్యంగా పెట్టుకుంది. 2027 డిసెంబరు నాటికి గ్రేటర్‌జోన్‌ను ఈవీ జోన్‌గా మారుస్తామని ప్రభుత్వం ప్రకటించిన నేపథ్యంలో ఈ దిశగా ఆర్టీసీ ప్రణాళికలు సిద్ధం చేస్తోంది. గ్రేటర్ రోడ్లపై ఇప్పటికే 450 ఈవీ బస్సులు నడుపుతున్న ఆర్టీసీ.. పీఎం ఈ డ్రైవ్ పథకం కింద అద్దె ప్రాతిపదికన 1500 ఈవీ బస్సులు, రాష్ట్ర ప్రభుత్వం సహకారంతో మరో 1500 ఎలక్ట్రిక్ బస్సులను సొంతంగా సమకూర్చుకునే ప్రయత్నాలు చేస్తోంది.గ్రేటర్‌లో రోజూ 25 లక్షలమంది ప్రయాణికులకు ఆర్టీసీ సేవలందిస్తోంది. వారిలో 18లక్షల మంది మహిళలు మహాలక్ష్మి పథకంతో ఉచిత ప్రయాణాలు సాగిస్తున్నారు. ఈ నేపథ్యంలో మహాలక్ష్మి ప్రయాణికులకు ఇబ్బందులు తలెత్తకుండా బస్సులు పెంచుకునేదిశగా ఆర్టీసీ చర్యలు తీసుకుంటుంది.

ప్రత్యేక దృష్టి సారించిన ఎండీ

గ్రేటర్‌జోన్‌పై టీజీఎస్‌ఆర్టీసీ ఎండీ నాగిరెడ్డి ప్రత్యేక దృష్టిసారించారు. గ్రేటర్‌జోన్ ను విస్తరించడంతో పాటు 26 బస్ డిపోల్లో ఈవీ చార్జింగ్ స్టేషన్ల ఏర్పాటుకు చర్యలు చేపడుతున్నారు. వచ్చే రెండేళ్లలో గ్రేటర్‌జోన్‌లో కేవలం ఎలక్ట్రిక్ బస్సులు మాత్రమే నడపాలని, ఓఆర్‌ఆర్ అవతల మాత్రమే డీజిల్ బస్సులు నడిపేలా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. శివార్ల నుంచి జిల్లాలకు సర్వీసులు నడిపితే ట్రాఫిక్ లేకుండా తక్కువ సమయంలో జిల్లా సర్వీసులు గమ్యస్థానాలకు చేరుకుంటాయని అధికారులు భావిస్తున్నారు.

# గురుకులాల్లో డిప్యూటేషన్లు రద్దు



హైదరాబాద్,(సువార్త ప్రతినిధి): తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాసంస్థ (టీజీఎస్‌డబ్ల్యూఆర్‌ఈఐఎస్)ల్లో బోధన సిబ్బంది కొరత సమస్యను పరిష్కరించేందుకు ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. హెడ్ ఆఫీసతో పాటు ఇతర విభాగాల్లో డిప్యూటేషన్‌పై సుదీర్ఘ కాలంగా విధులు నిర్వహిస్తున్న 16 మంది టీచింగ్ స్టాఫ్ డిప్యూటేషన్లను రద్దు చేసింది. ఆ 16 మందిని తిరిగి వారి పూర్వ స్థానానికి వెంటనే రావాలని ఆదేశించింది. ఇందుకు సంబంధించిన ఉత్తర్వులను టీజీఎస్‌డబ్ల్యూఆర్‌ఈఐఎస్ కార్యదర్శి శారద జారీ చేశారు. గురుకుల విద్యాసంస్థల్లో ఉపాధ్యాయుల కొరత తీవ్రంగా ఉండగా, కొందరు టీచింగ్ సిబ్బంది దీర్ఘకాలంగా హెడ్‌ఆఫీస్‌లోనే కొనసాగుతున్నారనే అంశాన్ని ఉపాధ్యాయ సంఘాలు, ఉద్యోగ సంఘాలు, పలువురు టీచింగ్ సిబ్బంది రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ దృష్టికి తీసుకెళ్లారు. ఈ అంశంపై సమీక్షించిన మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ బోధన సిబ్బంది తిరిగి పాఠశాలల్లోనే విధులు నిర్వహించేలా చర్యలు చేపట్టాలని ఖచ్చితమైన ఆదేశాలు ఇచ్చారు. ఈ నేపథ్యంలోనే డిప్యూటేషన్ల రద్దుపై నిర్ణయం వెలువడింది. మంత్రి అడ్లూరి తీసుకున్న నిర్ణయంపై ఉద్యోగ సంఘాలు, ఉపాధ్యాయ సంఘాలు హర్షం వ్యక్తం చేశాయి.

# నేడు ఆదాయపు పన్ను శాఖ 'ప్రారంభ్-2026'




హైదరాబాద్,(సువార్త ప్రతినిధి): ఆదాయపు పన్ను శాఖ ఆంధ్రప్రదేశ్, తెలంగాణ ఆధ్వర్యంలో "ప్రారంభ్ 2026" పేరుతో మెగా పన్ను చెల్లింపుదారుల అవగాహన కార్యక్రమం శుక్రవారం జరగనుంది. శుక్రవారం మధ్యాహ్నం 3 గంటలకు బంజారాహిల్స్, రోడ్ నం.12, మెహదీ మంజిల్‌లోని అమరావతి ఆడిటోరియంలో నిర్వహించనుంది. ఈ కార్యక్రమం ద్వారా ఆదాయపు పన్ను చట్టం-2025పై ప్రజల్లో అవగాహన కల్పించడమే లక్ష్యంగా పెట్టుకున్నారు. కేంద్ర ప్రత్యక్ష పన్నుల మండలి(సీబీడీటీ) సభ్యుడు సంజయ్ బహదూర్ ముఖ్య అతిథిగా హాజరవుతారు. శాఖ సీనియర్ అధికారులు పాల్గొంటున్నారు. సరళీకృత ఆదాయపు పన్ను చట్టం-2025 అమలులోకి వచ్చిన నేపథ్యంలో దేశవ్యాప్తంగా చేపట్టిన అవగాహన కార్యక్రమాల్లో భాగంగా "ప్రారంభ్ 2026" నిర్వహిస్తున్నారు. ఈ కొత్త చట్టం 2026 ఏప్రిల్ 1 నుంచి అమల్లోకి వచ్చింది. హైదరాబాద్‌తో పాటు ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లోని మరో 22 ప్రాంతాల్లో కూడా ఇలాంటి అవగాహన కార్యక్రమాలు ఒకేసారి నిర్వహిస్తున్నట్లు అధికారులు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు.

# బుస్... బుస్.. సిటీలో 54 శాతం విష సర్పాలే..

హైదరాబాద్ (సువార్త ప్రతినిధి): హైదరాబాద్ నగరంలో స్నేక్ స్నాచర్స్ రెస్క్యూలో పట్టుబడుతున్న పాముల్లో 54శాతం విష సర్పాలే అని సీఎస్ఐఆర్ - సెంటర్ ఫర్ సెల్యులార్ అండ్ మాలిక్యులర్ బయాలజీ (సీసీఎంబీ), ఫ్రెండ్స్ ఆఫ్ స్నేక్స్ సొసైటీ (ఎఫ్ఓఎస్) హైదరాబాద్ అధ్యయనం వెల్లడించింది. 2013-22 (పదేళ్ల)లో 55,467 పాములను పట్టుకున్నారు. వాటి వివరాలను తాజాగా గ్లోబల్ ఎకాలజీ అండ్ కన్జర్వేషన్ జర్నల్‌లో ప్రచురితమయ్యాయి.ట్టణీకరణ, స్థానిక వాతావరణ ప్రభావం కారణంగా హైదరాబాద్ చుట్టుపక్కల ప్రాంతాలలో పాములు తారసపడే సంఘటనలు ఇటీవల గణనీయంగా పెరుగుతున్నాయి. గడిచిన పదేళ్లలో ఏటా 8-10శాతం వృద్ధి ఉంది. భూ వినియోగ విధానం, పట్టణీకరణ, పెరిగిన రెస్క్యూ యాక్టివిటీలు దీనికి కారణం. ఈ క్రమంలోనే హైదరాబాద్‌లో రెస్క్యూ చేసిన పాములలో 54శాతం విషసర్పాలే అని, వీటిలోనూ తాచుపాములు (కోబ్రాలు) 47.5 శాతానికి పైగా ఉంటున్నాయి. విష సర్పం కాని జెర్రిపోతు (ర్యాట్ స్నేక్)ల సంఖ్య కూడా నగరంలో ఎక్కువే.. ఇవి 27శాతానికి పైగా ఉంటున్నాయని ఎఫ్ఓఎస్ సభ్యులు వెల్లడిస్తున్నారు. జనసాంద్రత అధికంగా కలిగిన పట్టణ వాతావరణంలో ఉంటున్నాయి.

# సాదాబైనామాకు సవాలక్ష చిక్కులు



హైదరాబాద్, (సువార్త ప్రతినిధి): సాదాబైనామా దరఖాస్తుల పరిష్కారానికి మార్గదర్శకాలు ఇచ్చేశామని, నిబంధనలను మరింత సరళతరం చేశామని ప్రభుత్వం, అధికారులు పదే పదే చెబుతున్నారు. అమ్మకందారు నుంచి అఫిడవిట్ అవసరం లేదని మార్గదర్శకాల్లో స్పష్టం చేసినట్లు వివరిస్తున్నారు. అయినా, అధికారులు దరఖాస్తులను తిరస్కరిస్తూనే ఉన్నారు. ఇందుకు తాజాగా తెరపైకి వచ్చిన సాంకేతిక సమస్య.. ఆన్‌లైన్లో అమ్మకందారు పేరు లేకపోవడం! నల్లగొండ జిల్లాకు చెందిన ఓ రైతు తెల్ల కాగితం మీద రాయించుకుని రెండెకరాల పొలం కొన్నాడు. అతనికి విక్రయించిన వ్యక్తి పేరు ఇప్పుడు ఆన్‌లైన్‌లో లేదనే కారణంతో దరఖాస్తును తిరస్కరించారు. కనీసం అమ్మిన వ్యక్తి నుంచి ఆధార్ నంబరు తీసుకురావాలని చెబుతున్నారని, రూ.లక్ష ఇస్తేనే ఆధార్ నంబరు ఇస్తామని విక్రయదారులు కొర్రీలు వేస్తున్నారని సదరు రైతు ఆందోళన వ్యక్తం చేశారు. మరో ఘటనలో.. వరంగల్ జిల్లాకు చెందిన ఓ రైతు సాదాబైనామా దరఖాస్తు పెట్టుకున్నాడు. అయితే, అక్కడ అతనికి భూమి విక్రయించిన రైతుకు చెందిన ముగ్గురు కుమారుల పేర్లు ఆన్‌లైన్‌లో ఉన్నాయి. దాంతో, సిస్టమ్ ఎవరి పేరూ తీసుకోవడం లేదని చెప్పి తన దరఖాస్తును తిరస్కరించారని సదరు రైతు వాపోయారు. సీసీఎల్‌ఏ ఎన్ని మార్గదర్శకాలు ఇచ్చినా.. సాదాబైనామా విషయంలో ఏదో ఒక తిరకాసు దరఖాస్తుదారులను ఆందోళనకు గురి చేస్తూనే ఉంది.రాష్ట్రవ్యాప్తంగా సుమారు 9,00,880 దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయి. నోటీసు జారీ చేసిన 30 రోజుల్లో వీటన్నిటినీ క్లియర్ చేయాలని స్పష్టమైన ఆదేశాలు ఇచ్చారు. కానీ, నోటీసు దశలోనే కొర్రీలు వేసి.. తిరస్కరిస్తున్నారని దరఖాస్తుదారులు వాపోతున్నారు. కొనుగోలుదారు, అమ్మకందారు ఇద్దరి అఫిడవిట్లు అవసరమని గతంలో మార్గదర్శకాలు ఇచ్చారు. సమస్య జటిలమవడంతో కొనుగోలుదారు ఒక్కరే అఫిడవిట్ ఇస్తే చాలని ప్రభుత్వం స్పష్టం చేసింది. కానీ.. ఇప్పుడు భూమి అమ్మిన యజమాని పేరు ఆన్‌లైన్‌లో లేదనే సాకుతో దరఖాస్తులను తిరస్కరిస్తున్నారనే ఫిర్యాదులు అధికంగా ఉన్నాయి. నిజానికి, గతంలో ఒక వ్యక్తి సాదాబైనామాపై మరో వ్యక్తికి భూమి అమ్మాడు. ఆ తర్వాత కొంత కాలానికి అతని పిల్లల పేర్లు ఆన్‌లైన్లో చేరాయి. ఇప్పుడు సాదాబైనామాకు ఆ పిల్లలు అంగీకరించడం లేదు. అలాగే, గతంలో అమ్మిన వ్యక్తులు వారి పేరు ఆన్‌లైన్‌లో ఉంటే పాస్ పుస్తకం రద్దవుతుందనే భయంతో.. పేర్లు నమోదు చేయించుకోలేదు. కొనుగోలు చేసిన వ్యక్తికి ఇప్పుడు అదే అడ్డంకిగా మారింది. 13బి జనరేట్ కావాలంటే తప్పనిసరిగా ఆన్‌లైన్‌లో అమ్మిన వ్యక్తి వివరాలు నమోదు చేయాలి. 13బి ఉంటేనే కొనుగోలు చేసిన వ్యక్తికి ఆ భూమిపై చట్టబద్ధమైన హక్కు లభిస్తుంది. దానిని జారీ చేసిన తర్వాతే పట్టాదారు పాస్ పుస్తకం ఇస్తారు. ప్రభుత్వ పథకాలు, బ్యాంకు రుణాలు తీసుకోవాలన్నా ఇది తప్పనిసరి. ఇప్పుడు అమ్మకందారు నుంచి ఆమోదం తీసుకురాలేకపోతే.. ఆ దరఖాస్తును వెంటనే తిరస్కరిస్తున్నారని రైతులు ఆవేదన చెందుతున్నారు.

# జూబ్లీహిల్స్ 'రిచ్ కిడ్స్' ట్రాప్ కేసు.. రిమాండ్ రిపోర్ట్‌లో సంచలన నిజాలు




హైదరాబాద్,(సువార్త ప్రతినిధి): హైదరాబాద్‌లో సంచలనం సృష్టించిన జూబ్లీహిల్స్ ఇన్‌స్టాగ్రామ్ ట్రాప్ కేసులో పోలీసులు సంచలన విషయాలను వెలుగులోకి తీసుకువచ్చారు. రిచ్ కిడ్స్‌ను లక్ష్యంగా చేసుకుని సోషల్ మీడియా ద్వారా మైనర్ బాలికలను ట్రాప్ చేసిన ఈ కేసులో మొత్తం 11 మందిని నిందితులుగా చేర్చినట్లు సమాచారం. కేసుకు సంబంధించిన రిమాండ్ కాపీలో అనేక సంచలన అంశాలు బయటపడగా, మైనర్లను బ్లాక్‌మెయిల్ చేసి లక్షల రూపాయలు వసూలు చేసిన భారీ నెట్‌వర్క్ ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. ఈ రిమాండ్ రిపోర్టు కి చిక్కింది. అందులో ఏముందంటే..

**ఇన్‌స్టాగ్రామ్ ద్వారా మైనర్‌కు వల..**

పోలీసుల దర్యాప్తు ప్రకారం.. ప్రధాన నిందితుడు అర్జున్ ఇన్‌స్టాగ్రామ్ ద్వారా బాలికతో పరిచయం పెంచుకున్నాడు. మొదట స్నేహంగా ప్రారంభమైన పరిచయం తర్వాత బలవంతపు సంబంధాలకు దారితీసినట్లు పోలీసులు గుర్తించారు. అర్జున్‌తో పాటు రాజీవ్, వారి స్నేహితుల పాత్ర కూడా ఈ కేసులో ఉన్నట్లు దర్యాప్తులో తేలింది. బాధితురాలి కుటుంబ సభ్యులు పలుమార్లు అర్జున్‌ను హెచ్చరించినప్పటికీ అతను తన ప్రవర్తన మార్చుకోలేదని సమాచారం. గత ఏడాదిలోనే అర్జున్‌పై పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు రిమాండ్ రిపోర్టులో ప్రస్తావించారు.

**అరెస్ట్ అయినా మారని అర్జున్..**

అర్జున్ గతంలోనే పోక్సో కేసులో అరెస్ట్ అయ్యి బెయిల్‌పై బయటకు వచ్చాడు. అయితే జైలు నుంచి విడుదలైన తర్వాత కూడా అతను బాలికతో ఇన్‌స్టాగ్రామ్ ద్వారా తిరిగి కనెక్ట్ అయ్యాడు. దీంతో కేసు మరింత తీవ్రమైంది. బాలిక కుటుంబం అర్జున్‌తో మాట్లాడొద్దని హెచ్చరించినా, ఇంట్లో పని చేసే సరస్వతి అనే మహిళ ఫోన్‌ను వినియోగించి బాలిక అతనితో మాట్లాడినట్లు పోలీసులు గుర్తించారు.

**పనిమనిషి బ్లాక్‌మెయిల్..**

ఈ కేసులో మరో కీలక పాత్రగా పనిమనిషి సరస్వతి పేరు బయటపడింది. మైనర్ బాలిక పరిస్థితిని ఆసరాగా తీసుకుని ఆమెను బ్లాక్‌మెయిల్ చేస్తూ రూ.9 లక్షలు వసూలు చేసినట్లు పోలీసులు గుర్తించారు. అర్జున్‌తో సంబంధాల విషయం బయటపెడతానంటూ బాలికను.. పనిమనిషి బెదిరించినట్లు సమాచారం. ఈ వ్యవహారంలో ఆమె పాత్రపై పోలీసులు ప్రత్యేకంగా దర్యాప్తు చేస్తున్నారు.

**మూడు నెలల్లో రూ.13 లక్షలు..**

ఈ ఏడాది జనవరి నుంచి మార్చి వరకు పలు సందర్భాల్లో అర్జున్ బాలికపై లైంగిక దాడులకు పాల్పడినట్లు పోలీసులు పేర్కొన్నారు. అదే సమయంలో వివిధ అవసరాలు, సమస్యలు అంటూ బాధితురాలి నుంచి సుమారు రూ.13 లక్షలు తీసుకున్నట్లు పోలీసులు వెల్లడించారు. అర్జున్ అడిగిన డబ్బులు ఇవ్వడానికి బాలిక ఇంట్లోనే దొంగతనానికి పాల్పడినట్లు దర్యాప్తులో తేలింది. తన తండ్రికి తెలియకుండా ఇంట్లోని కప్‌బోర్డ్ నుంచి లక్షల రూపాయలు తీసుకుని అర్జున్‌కు ఇచ్చినట్లు పోలీసులు గుర్తించారు.

**డబ్బులు కనిపించకపోవడంతో..**

ఇంట్లో పెద్ద మొత్తంలో డబ్బులు కనిపించకపోవడంతో బాలిక తండ్రికి అనుమానం వచ్చింది. డబ్బుల గురించి నిలదీయగా మొదట బాలిక సమాధానం చెప్పలేకపోయింది. తర్వాత అసలు విషయం బయటపడటంతో కుటుంబ సభ్యులు షాక్‌కు గురయ్యారు. ఆ తర్వాత వారు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ఈ కేసు వెలుగులోకి వచ్చింది. పోలీసులు వెంటనే విచారణ ప్రారంభించి పలు కీలక ఆధారాలు సేకరించారు.

**అర్జున్ తల్లి అకౌంట్లలో డబ్బుల లావాదేవీలు..**

ఈ కేసు దర్యాప్తులో భాగంగా పోలీసులు అర్జున్ తల్లి మీనాకుమారి బ్యాంక్ ఖాతాలను పరిశీలించారు. బాధితురాలి నుంచి ఆమె ఖాతాలకు డబ్బులు జమ అయినట్లు గుర్తించారు. దీంతో ఈ వ్యవహారంలో కుటుంబ సభ్యుల పాత్రపై కూడా అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. డబ్బుల ట్రాన్సాక్షన్లపై ఫోరెన్సిక్ ఆడిట్ నిర్వహిస్తున్నట్లు సమాచారం. ఎవరెవరు ఈ వ్యవహారంలో భాగస్వాములయ్యారనే విషయంపై పోలీసులు సమగ్ర దర్యాప్తు చేస్తున్నారు.

**మరో బాధితురాలి ఫిర్యాదు..**

ఈ కేసులో బాలికతో పాటు మరో యువతి కూడా అర్జున్‌పై ఫిర్యాదు చేసింది. దీంతో కేసు మరింత కీలకంగా మారింది. సోషల్ మీడియా ద్వారా యువతులను లక్ష్యంగా చేసుకుని మోసం చేస్తున్న గ్యాంగ్‌పై పోలీసులు పూర్తి స్థాయిలో దర్యాప్తు చేస్తున్నారు.

**నార్సింగ్ పోలీస్ స్టేషన్‌కు కేసు బదిలీ..**

మొదట జూబ్లీహిల్స్ పరిధిలో నమోదైన ఈ కేసును తర్వాత నార్సింగ్ పోలీస్ స్టేషన్‌కు బదిలీ చేశారు. ఈ కేసుకు సంబంధించిన అన్ని అంశాలను సమగ్రంగా పరిశీలిస్తున్న పోలీసులు, త్వరలో మరికొందరిని అదుపులోకి తీసుకునే అవకాశం ఉందని తెలుస్తోంది.

**సోషల్ మీడియా మోసాలపై హెచ్చరిక..**

ఈ ఘటన నేపథ్యంలో పోలీసులు తల్లిదండ్రులకు కీలక సూచనలు చేశారు. పిల్లలు సోషల్ మీడియాలో ఎవరితో మాట్లాడుతున్నారు?, ఎలాంటి అకౌంట్లను ఫాలో అవుతున్నారు? అనే విషయాలపై పర్యవేక్షణ అవసరమని సూచిస్తున్నారు. అపరిచితులతో వ్యక్తిగత సమాచారం పంచుకోవద్దని, బ్లాక్‌మెయిల్‌కు గురైతే వెంటనే కుటుంబ సభ్యులకు లేదా పోలీసులకు సమాచారం ఇవ్వాలని అధికారులు చెబుతున్నారు.











# విశ్వాస సంఘాలలో భద్రతపై విచారణను ప్రారంభించిన APPG



(సువార్త ప్రతినిధి): విశ్వాస సమాజాలలో సంరక్షణపై అఖిల పక్ష పార్లమెంటరీ బృందం, చర్చిలు, మసీదులు, దేవాలయాలు మరియు ఇతర మతపరమైన ప్రదేశాలలో పిల్లల రక్షణను మెరుగుపరచడం లక్ష్యంగా ఒక విచారణను ప్రారంభించింది. ఈ రంగంలో పాలుపంచుకున్న ప్రతి ఒక్కరినీ – అంటే మత నాయకులు, సంరక్షణ అధికారులు, స్వచ్ఛంద సేవకులు, యువజన కార్యకర్తలు, బాధితులు మరియు సంస్థలను – వారి నిజ జీవిత అనుభవాలను మరియు సాక్ష్యాలను పంచుకోవాలని ఈ బృందం ఆహ్వానిస్తోంది. ఇందులో ఒక ప్రశ్నావళి, లిఖితపూర్వక సమర్పణలు మరియు విచారణలు ఉంటాయి. దీనికి గడువు జూలై 2026 మరియు సిఫార్సులతో కూడిన ఒక నివేదికను రూపొందించడంతో ఈ ప్రక్రియ ముగుస్తుంది. ఈ విచారణకు కేంద్రబిందువు "నియంత్రిత కార్యకలాపం" అనే భావన. ఇది ఒక చట్టపరమైన పదం. పిల్లలతో చేసే పని లేదా స్వచ్ఛంద సేవలో అధిక ప్రమాదం ఉన్నప్పుడు, మెరుగైన ఐదీూ తనిఖీల వంటి కఠినమైన చట్టపరమైన ప్రమాణాలను తప్పనిసరిగా అమలు చేయాలని ఇది సూచిస్తుంది. మతపరమైన ప్రదేశాలలో, ఉదాహరణకు సండే స్కూల్, యువజన బృందం, బైబిల్ అధ్యయనం లేదా ప్రార్థన సమావేశాలలో, ఇటువంటి నియమాలు ఎప్పుడు వర్తిస్తాయనే దానిపై కొన్నిసార్లు స్పష్టత లోపిస్తుంది. కొన్ని పరిస్థితులు అనధికారికమైనవిగా పరిగణించబడతాయి మరియు చట్టపరంగా వాటికి మెరుగైన తనిఖీలు అవసరం ఉండకపోవచ్చు.

# బాండి ఉగ్రదాడి నేపథ్యంలో 'ఇస్లాం వ్యాఖ్యలు' చేశారనే విషయంపై మతగురువుకు మరణ బెదిరింపులు.



(సువార్త ప్రతినిధి): బాండీ బీచ్ ఉగ్రదాడి నేపథ్యంలో యూదు సమాజానికి మద్దతు తెలిపినందుకు, సిడ్నీలోని ఒక మతగురువు ప్రాణహాని బెదిరింపులకు గురైనట్లు అనుమానిస్తున్నారు. గురువారం బాండీ జంక్షన్‌లోని హోలీ క్రాస్ కాథలిక్ చర్చికి అజ్ఞాతంగా రెండు పేజీల లేఖ అందిన తర్వాత, ఫాదర్ మిర్కో ఇంటెగ్లియాకు పోలీసుల రక్షణ కల్పించారు. ఆస్ట్రేలియాలోని డైలీ టెలిగ్రాఫ్ నివేదిక ప్రకారం, "మీరు ముస్లింల గురించి మాట్లాడటం కొనసాగిస్తే, మీ అందరినీ చంపేస్తాను... మీరు ఇస్లాం గురించి ఏమైనా మాట్లాడితే, మీరు కూడా అదే శిక్షను అనుభవిస్తారు" అని ఆ లేఖలో పేర్కొన్నారు. ఫాదర్ మిర్కోను నేరుగా ప్రస్తావించనప్పటికీ, డిసెంబర్ 2025లో జరిగిన మారణకాండ తర్వాత ఆయన చేసిన వ్యాఖ్యల కారణంగానే ఆయనపై దృష్టి కేంద్రీకరించినట్లు భావిస్తున్నారు. ఒక బ్లాగ్ పోస్ట్‌లో, "అమాయకుల మారణకాండ" గురించి ఆలోచిస్తూ కొత్త సంవత్సరాన్ని జరుపుకోవడం "అసాధ్యం" అని ఆయన అన్నారు. ఆ దాడిలో మరణించిన పదేళ్ల మటిల్డాను ఆయన ప్రత్యేకంగా ప్రస్తావించారు. మారణకాండపై ఒక నివేదిక ప్రచురితమైన రోజే ఆయనకు ఈ మరణ బెదిరింపు అందింది. ఈ దాడికి తామే బాధ్యులమని ఇస్లామిక్ స్టేట్ ప్రకటించింది. న్యూ సౌత్ వేల్స్ టాస్క్‌ఫోర్స్ షెల్టర్ అధికారులు ఫాదర్ మిర్కోను పోలీసుల పర్యవేక్షణలో ఉంచినట్లు చెబుతున్నారు. చర్చికి చెందిన ఒక ఫేస్‌బుక్ పోస్ట్‌లో ఇలా ఉంది: "గత వారం మా ప్రియమైన పూజారి, ఫాదర్ మిర్కో ఇంటెగ్లియాకు మరణ బెదిరింపులు వచ్చాయన్న హృదయ విదారక వార్తతో మా పారిష్ దిగ్భ్రాంతికి గురైంది. దేవునికి సేవ చేస్తూ, కుటుంబాల చీకటి క్షణాలలో వారికి అండగా నిలుస్తూ, బాధలో ఉన్నవారిని ఓదారుస్తూ, దారి తప్పినవారికి మార్గనిర్దేశం చేస్తూ, ఈ సమాజానికి తన పూర్తి హృదయాన్ని అంకితం చేసిన ఒక వ్యక్తి ఎప్పటికీ భయాన్ని, ద్వేషాన్ని ఒంటరిగా ఎదుర్కోవలసి రాకూడదు."

# మేఘాలయలోని గారో హిల్స్ లో మాదకద్రవ్యాల వ్యాపారులపై పోరాటానికి చేతులు చేతులు కలపిన బాప్టిస్ట్ చర్చి మరియు ప్రభుత్వం



(సువార్త ప్రతినిధి): మేఘాలయలో పెరుగుతున్న మాదకద్రవ్యాల దుర్వినియోగ సంక్షోభాన్ని ఎదుర్కోవడానికి మత సంస్థల భాగస్వామ్యంతో మాదకద్రవ్యాల నిరోధక మిషన్ తన ప్రయత్నాలను ముమ్మరం చేస్తున్న నేపథ్యంలో, పశ్చిమ గారో హిల్స్‌లోని తురాలో ఉన్న బాప్టిస్ట్ చర్చి, ప్రభుత్వ పునరావాస కేంద్రం కోసం తమ ప్రాంగణాన్ని అందించింది. డ్రగ్ రిడక్షన్, ఎలిమినేషన్ అండ్ యాక్షన్ మిషన్ (ఐ=జూూవీ) ఏప్రిల్ 23న ప్రతిపాదిత ప్రాంగణాన్ని పరిశీలించింది. మరుసటి రోజు, దాని డైరెక్టర్ ఫ్రాన్సిస్ ఖర్షింగ్, తదుపరి చర్యలను రూపొందించడానికి పశ్చిమ గారో హిల్స్ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ కార్యాలయంలో ఒక ఉన్నత స్థాయి సమన్వయ సమావేశానికి అధ్యక్షత వహించారు. ఈ సమావేశానికి డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ (పశ్చిమ రేంజ్), డిప్యూటీ కమిషనర్లు, జిల్లా సాంఘిక సంక్షేమ అధికారులు, భాగస్వామ్య ఎన్జీఓలు, గారో హిల్స్‌లోని అన్ని జిల్లాల నుండి మత సంస్థలు మరియు పౌర సమాజ ప్రతినిధులు హాజరయ్యారు. ఈ సంక్షోభానికి మరింత కరుణామయ ప్రతిస్పందన దిశగా చర్చిలతో భాగస్వామ్యం ఒక ముఖ్యమైన ముందడుగు అని ఖర్షింగ్ అన్నారు. "ఇంత లోతుగా పాతుకుపోయిన సమస్యను పరిష్కరించడానికి కేవలం చర్చి, ప్రభుత్వం మాత్రమే కాకుండా, యావత్ పౌర సమాజం చురుకైన భాగస్వామ్యం అవసరం," అని ఆయన అన్నారు. సమస్య యొక్క తీవ్రత ఈ చొరవకు అత్యవసరతను కల్పిస్తోంది. అధికారిక అంచనాల ప్రకారం మేఘాలయలో మాదకద్రవ్యాలు వాడేవారి సంఖ్య దాదాపు 3 లక్షలకు చేరింది. గత ఏడాది ఈ సంఖ్య 2 లక్షలుగా ఉండేది. ఇది రాష్ట్రంలోని 32 లక్షల జనాభాలో దాదాపు 10 శాతానికి సమానం. ఈ జనాభాలో క్రైస్తవులు సుమారు 83 శాతం ఉన్నారు. రాష్ట్రంలో చర్చిలే ప్రధాన సామాజిక సంస్థలు కావడంతో, ఈ భాగస్వామ్యం విస్తృత పరిధిని కలిగి ఉంది. మేఘాలయ భౌగోళిక పరిస్థితి ఈ క్లిష్టతను మరింత పెంచుతోంది. ప్రపంచంలోనే అక్రమ మాదకద్రవ్యాల ప్రధాన వనరులలో ఒకటైన, మయన్మార్, థాయ్‌లాండ్ మరియు లావోస్‌లను కలిపే సరిహద్దు ప్రాంతమైన 'గోల్డెన్ ట్రయాంగిల్'కు ఈ రాష్ట్రం సమీపంలో ఉంది.

# ప్రపంచ కప్ 2026 ప్రచార కార్యక్రమం, స్నేహితులు మరియు పొరుగువారికి ఆతిథ్యం ఇవ్వడానికి లక్ష మంది క్రైస్తవులను సన్నద్ధం చేయడమే లక్ష్యం.....




(సువార్త ప్రతినిధి): 2026 ఫీఫా ప్రపంచ కప్‌కు అనుసంధానంగా, క్రూ ఒక దేశవ్యాప్త కార్యక్రమాన్ని ప్రారంభించింది. దీని లక్ష్యం, అమెరికాలోని లక్ష మంది క్రైస్తవులకు మరియు పదివేల చర్చిలకు వాచ్ పార్టీలను నిర్వహించడానికి, అలాగే ఈ టోర్నమెంట్‌ను విశ్వాస సంభాషణలకు ఒక వేదికగా ఉపయోగించుకునేలా సన్నద్ధం చేయడం. "విక్టరీ బియాండ్ ది కప్" అని పిలువబడే ఈ ప్రచారాన్ని సోమవారం ప్రకటించారు. జూన్ 11న ప్రారంభమై జూలై 19న ముగిసే నెల రోజుల టోర్నమెంట్ సమయంలో, విశ్వాసులు తమ స్నేహితులు, పొరుగువారు మరియు సహోద్యోగులను తమ ఇళ్లకు లేదా చర్చిలకు ఆహ్వానించేలా ప్రోత్సహించడమే ఈ కార్యక్రమం యొక్క ముఖ్య ఉద్దేశ్యమని నిర్వాహకులు తెలిపారు. ఫెలోషిప్ ఆఫ్ క్రిస్టియన్ అథ్లెట్స్, ఆల్ఫా యూఎస్ఏ మరియు ఐ యామ్ సెకండ్ వంటి సంస్థలతో భాగస్వామ్యంతో క్రూ ఈ కార్యక్రమానికి నాయకత్వం వహిస్తోంది. విక్టరీ బియాండ్ ది కప్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ హీథర్ రెడ్డి మాట్లాడుతూ, విభిన్న సాంస్కృతిక నేపథ్యాల ప్రజలను ఒకచోట చేర్చగల అరుదైన ప్రపంచ స్థాయి కార్యక్రమంగా ప్రపంచ కప్‌ను నిర్వాహకులు చూస్తున్నారని అన్నారు. "స్నేహితులతో కలిసి చూడటం, స్కోర్‌లను తనిఖీ చేయడం లేదా యునైటెడ్ స్టేట్స్ ఆతిథ్య నగరాల్లో ఒక ఆటకు హాజరు కావడం వంటి వాటి ద్వారా చాలా మంది ప్రపంచ కప్‌తో మమేకమవుతున్నందున, సువార్త ప్రభావాన్ని చూపడానికి ఉన్న ఈ అవకాశాన్ని వదులుకోకూడదు," అని ఈ ప్రచారాన్ని ప్రకటిస్తూ రెడ్డి అన్నారు. యునైటెడ్ స్టేట్స్, కెనడా మరియు మెక్సికో సంయుక్తంగా ఆతిథ్యం ఇస్తున్న 2026 ఫీఫా ప్రపంచ కప్, క్రీడా చరిత్రలోనే అత్యధిక ప్రేక్షకాదరణను పొందుతుందని అంచనా. ఈ క్రైస్తవ సువార్త ప్రచార నిర్వాహకులు, ప్రపంచవ్యాప్తంగా 5 బిలియన్ల మంది వరకు ప్రసారాలు మరియు ఆన్‌లైన్ కవరేజ్ ద్వారా ఈ టోర్నమెంట్‌ను అనుసరించవచ్చని అంచనాలను ఉదహరించారు.

Printer, publisher, Editer and owend by Chatla Luthar Prasanth Kumar,Publishing from 15-7, Chalapadu, Chebrole (M), Guntur-522124, Printed at Suvartha printers, Chalapadu (V"Chebrole (M),Guntur.Ap.
Editor Chatla Luthar Prasanth Kumar,E-mail news@suvaartha.com (M)888 66 123 28